

**చికెన్ రేటు 200పైనే..**

ఓవైపు కోడిగుడ్ల ధరలు పెరుగుతుండగా మరోవైపు చికెన్ ధరలు కూడా పైపైకి ఎగబాకుతున్నాయి. ఎవరూ ఊహించని విధంగా అకాశానికి నిచ్చేన వేస్తున్నాయి. పూజలు మాసాలు వెళ్ళిపోవడంతో చికెన్ వినియోగం పెరిగింది. దీంతో ధరలు కూడా అదేస్థాయిలో పెరుగుతున్నాయి. ప్రస్తుతం కిలో స్కిన్‌లెస్ చికెన్ ధర 220గా ఉంది. ముక్క లేనిదే ముద్దదిగని మాంస ప్రియులు చికెన్ తినాలంటే జేబును తడుముకోవాల్సిన పరిస్థితి వస్తుంది. పెరుగుతున్న చికెన ధరలతో కిలో కొనేవారు అరకిలోతో సరిపెట్టుకుంటున్నారు.



హైదరాబాద్ వార్త

# కోడిగుడ్ల ధరలకు రెక్కలు

**ఉత్పత్తి పెరిగినా తగ్గనిరేట్లు**

**కోళ్ల దాణా రేట్లు పెరిగాయంటున్న వ్యాపారులు**

**ప్రస్తుతం ఒక్కోగుడ్డు ధర రూ.7**

హైదరాబాద్, డిసెంబరు 5, ప్రభాతవార్త: కోడిగుడ్డు పోషకాహారం రోజుకోగుడ్డు తింటే మనిషి ఆరోగ్యవంతంగా ఉంటాడని వైద్యులు అంటున్నారు. అయితే ఆరోగ్యానికి చేసే మేలు కోడిగుడ్ల ధరలు ఒక్కసారిగా ఎగబాకాయి. దీంతో వాటిని కొనాలంటే జంకాల్సిన పరిస్థితి. ప్రస్తుతం కోడిగుడ్డు ధర హోల్‌సెల్‌గా రూ.5.30 నుంచి 6లకు విక్రయిస్తుండగా రిటైల్‌గా రూ. 7లకు అమ్ముతున్నారు. రోజుకోసారో.. రెండు రోజులకోసారో కోడిగుడ్డును తినేవారు. ధర పెరగడంతో గుడ్ల వినియోగతగ్గే అవకాశం ఉంది. కరోనా సమయంలో వ్యాప్తి కోళ్ల ద్వారా వస్తుందన్న ప్రచారం జరగడంతో చికెన్ తినడమే మానేశారు. దీంతో అప్పట్లో పౌల్ట్రీ రంగం కుదేలైంది. కోళ్లను ప్రాణముండగానే జేసిబిలతో గుంత తవ్వి మరీపాతి పెట్టేశారు. రూ50కి కూడా కోళ్లను విక్రయించారు. తర్వాత మళ్ళీ ధర పుంజుకుంది. అయితే కోళ్ల ఉత్పత్తి ఇప్పటికే బాగానే ఉంది. అయితే కోళ్లకు వేసేదాణా ఖర్చులు, ఎగుమతులు పెరగడం వల్లే ఇక్కడ గుడ్లరేటు పెరగడానికి కారణమని వ్యాపారులు తెలుపుతున్నారు. కొద్దిరోజుల క్రితం కార్తీకమాసం కావడంతో వినియోగం కొంతమేర తగ్గి ఒక్కో గుడ్డు 5.50పలికింది. కార్తికమాసం ముగియడంతో మళ్లీ గుడ్లకు రెక్కలొచ్చాయి. డజన్ గుడ్ల ధర రూ.80పెరగగా..ఒక్కో గుడ్డు ధర రూ.7అయ్యింది. వినియోగంతోపాటు దాణా ధరలు పెరగడమే అధిక ధరలకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. కాగా గ్రేటర్‌లో రూ.70లక్షల గుడ్ల వినియోగం ఉంటుంది. రాబోయే రోజుల్లో గుడ్డుధర రూ.10వరకు పెరిగే అవకాశాలు లేకపోలేదని నిర్వాహకులు తెలుపుతున్నారు.

# టిఎన్జీవోస్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్‌మీట్ - 2023

హైదరాబాద్, డిసెంబరు 5,ప్రభాతవార్త: టిఎన్జీవోస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం హుస్సేనీ (ముజీబ్) అధ్వర్యంలో నిర్వహిస్తున్న 8వ స్పోర్ట్‌మీట్ - 2023'ఘనంగా ప్రారంభమైంది. ఈమేరకు సోమవారం ఎల్బీస్టేడియంలో జరిగిన ప్రారంభోత్సవ వేడుకలకు క్రీడల మంత్రి శ్రీనివాస్‌గౌడ్, హోంమంత్రి మహమూద్ అలీ, సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మామిళ్ల రాజేందర్ హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఉదయం 10గంటలకు జాతీయ జెండా ఆవిష్కరణతో కార్యక్రమాన్ని ప్రారంభించగా ఎన్‌సిసి విద్యార్థులు విన్యాసాలతో మైదానం హోరెత్తించారు. ఈసందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉద్యోగులకు సంబంధించిన క్రీడా ఉత్సవాలు జరుపుతామని, దానికి సంబంధించిన విధివిధానాలను చైర్మన్ రాజేంద్ర ఆధ్వర్యంలో చర్చించి ప్రకటిస్తారని తెలిపారు. ఈకార్యక్రమంలో సెంట్రల్ యూనియన్ సభ్యులు సత్యనారాయణ, రామినేని శ్రీనివాస్, ఉమాదేవి, శైలజ, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, కార్యదర్శి బుచ్చిరెడ్డి, హైదరాబాద్ సిటీ అధ్యక్షులు శ్రీరామ్, కార్యదర్శి శ్రీకాంత్, నాలుగో తరగతి యూనియన్ అధ్యక్షులు గడ్డం జ్ఞానేశ్వర్, కార్యదర్శి ఖదర్‌బిన్ హసన్, జిల్లా కార్యదర్శి ఎస్.విక్రమ్‌కుమార్, బాలరాజు, సభ్యులు రాజ్‌కుమార్ , ఉమర్‌ఖాన్ తదితరుల పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, మహమూద్‌అలీ, రాజేందర్, ముజీబ్ తదితరులు

# మా గూళ్లను కూల్చొద్దు సారు..

**కూల్చవద్దంటూ వేడుకున్న బాధితులు**

**గాజులరామారంలో కబ్జాల తొలగింపు**

**పోలీసు బందోబస్తు మధ్య**

**ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణల తొలగింపు**



పోలీసులు పర్యవేక్షణలో ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

జీడిమెట్ల, డిసెంబర్ 5 ప్రభాతవార్త : ప్రభుత్వ స్థలాల్లో వెలిసిన ఆక్రమణలపై రెవెన్యూ యంత్రాంగం కన్నెర్రజేసింది. భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణలను నేలమట్టం చేసింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం పరిధిలోని సర్వేనంబర్ 342లోని ప్రభుత్వ స్థలంలో కొంతకాలంగా కొందరూ ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీనిపై స్పందించిన తహసీల్దార్ సంజీవరావు సిబ్బందితో కలిసి సదరు స్థలాలను పరిశీలించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించినట్లు గుర్తించిన ఆయన వెంటనే తొలగించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆర్ఐ పరమేశ్వర్‌రెడ్డి సోమవారం భారీ పోలీసుబందోబస్తు నడుమ ప్రభుత్వ స్థలాలల్లో వెలసిన పదుల సంఖ్యలో నిర్మాణాలపై నేలమట్టం చేశారు. అధికారుల చర్యలకు స్థానికులు అడ్డుతగలడంతో పోలీసులు వారిని నియంత్రించడంతో రెవెన్యూ అధికారులు ఆక్రమణలను జేసిబి సహాయంతో తొలగించారు.



కూల్చవద్దంటూ అడ్డుపడుతున్న బాధితులను అడ్డుకుంటున్న పోలీసులు

ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**కూల్చవద్దంటూ వేడుకున్న బాధితులు..**

కూలీనాలీ చేసి కొనుగోలు చేశాం. చిన్న గూడు వేసుకొని నివాసం ఉంటున్నాం సార్. మాగూడును తొలగించవద్దు అంటూ అందులో నివాసం ఉంటున్న వారు అధికారులను వేడుకున్నారు. అమ్మిన వారు బాగానే ఉన్నారు. కొనుగోలు చేసిన మేము ఆగం అవుతున్నామని వారి గోడు వెల్లబోసుకున్నారు. దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలాలను కొనుగోలు చేయవద్దని, చట్టరీత్యా నేరమని ఇప్పటికే పలుమార్లు మీకు తెలియజేశామన్నారు. మీరు ఎవరి వద్ద కొనుగోలు చేశారో వ్రాతపూర్వకంగా ఫిర్యాదు చేయండి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## చాట్ల శ్రీరాములు, గరిమెళ్ళ రామమూర్తి పేరిట పురస్కారాలు



కల్యాణికి పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న డా.కె.వి.రమణాచారి

సైఫాబాద్, డిసెంబరు 5 ప్రభాతవార్త: రసరంజని, చాట్ల శ్రీరాములు థియేటర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వర్గీయ గరిమెళ్ళ రామమూర్తి 86వ జయంతి వేడుకలు, స్వర్గీయ చాట్ల శ్రీరాముల 91వ జయంతి సోమవారం సాయంత్రం రవీంద్రభారతిలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా.కె.వి.రమణాచారి రామమూర్తి పేరిట రంగస్థల పురస్కారాన్ని-2022 సినీయర్ రంగస్థల నటి, ప్రయోక్త, దర్శకురాలు అన్నలూరి కళ్యాణికి, అలాగే శ్రీరాములు పేరిట ప్రతిభా పురస్కారాన్ని-2022 సినీయర్ రంగస్థల, సినిమా, టివి నటుడు దర్శకుడు నిట్టల శ్రీరామమూర్తికి ఆయన ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ నాటక రంగానికి చాట్ల శ్రీరాములు, గరిమెళ్ళ రామమూర్తి ఎనలేని సేవలు అందిచారని కొనియాడారు, నాటకమే ఒక తపసు స్సగా భావించి నిత్యం నాటకరంగానికి వారు ఎంతో కృషి చేశారని, వారి సేవలు మరువలేనివన్నారు. గరిమెళ్ళ మరో మొహంజదారో నాటకం ప్రదర్శించడంలో ముఖ్య భూమిక నిర్వహించారని ఆయన తెలిపారు. ఈ సభకు సుప్రసిద్ధ సిహితీవేత్త వోలేటి పార్వతీశం అధ్యక్షత వహించారు. సభలో టివి, సినీమా నటుడు యు.సుబ్బరాయశర్మ, కామేశ్వరరావు, ఆదిలక్ష్మి పాల్గొన్నారు. సభానంతరం జయాఆర్ట్స్ సమర్పించు 'సందడే సందడి' నాటికి ప్రదర్శన అద్భుతంగా జరిగింది.

## డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన



11లక్షలతో డ్రైనేజిపైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న కాలేరు వెంకటేష్, పద్మావెంకట్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 5 ప్రభాతవార్త:అంబర్‌పేట డివిజన్‌లోని కుమ్మరిబస్తీలో 11 లక్షల రూపాయలు ఖర్చుతో నిర్మించనున్న నూతన డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పోరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి సోమవారం శంకుస్తాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబర్‌పేట నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ప్రజలకు మంచి నీటి, డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా పైప్‌లైన్‌లు వేస్తు న్నామని తెలిపారు. ఇప్పటికే చాలా చోట్ల పను లు పూరైయినాయని మిగిలిన చోట్ల కూడా త్వర లో పూర్తిచేస్తామన్నారు. అలాగే కుమ్మరి బస్తీలో డ్రైనేజీ పైప్‌లైన్ వేసిన వెంటనే సిసి రోడ్డు పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే బస్తీలో పర్యటించి ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, బస్తీవాసులు పాల్గొన్నారు.

## అయ్యప్ప నామ స్మరణంతో..

# మార్మోగిన మణికొండ గ్రామం



మంచిరేవులలో జరిన అయ్యప్ప మహా పడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు

నార్సింగి, డిసెంబర్ 5 ప్రభాతవార్త : కలియుగ ప్రత్యక్ష దైవమైన హరిహర తనయుడు అయ్యప్ప నామ స్మరణంతో మంచిరేవుల గ్రామం మారుమ్రోగింది. గండిపేట్ మండల పరిధిలోని మంచిరేవుల గ్రామం మొత్తం సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అయ్యప్ప భక్తిగీతాలే వినిపించాయి. మంచిరేవుల మాజీ సర్పంచ్, నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మేకల ప్రవీణ్ యాదవ్ ఇంటి వద్ద కేశవ గురుస్వామి నేతృత్వంలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా అయ్యప్పస్వామి మహా పడి పూజ వైభవంగా జరిగింది. వందలాది మంది అయ్యప్ప స్వాములు లయబద్ధంగా హరిహర తనయుడిని స్తుతిస్తూ ఆలపించిన భక్తిగీతాలు ఆహుతులను, స్థానిక ప్రజలను భక్తిసాగరంలో ముంచెత్తాయి. నార్సింగికి చెందిన జై శాంభవి భక్త సమాజ్ గురుస్వామి నర్సింగ్‌రావ్ ఆధ్వర్యంలో సాగిన భజన ఆద్యాంతం అయ్యప్ప భక్తులను ఆనందపరవశులను చేసింది. ఈ పూజకు స్థానిక ఏమ్మేల్యే ప్రకాశ్‌గౌడ్, మాజీ ఏంపీపీ తలారి మల్లేష్ ముదిరాజ్, టీఆర్‌ఏస్ గండిపేట మండల అధ్యక్షులు రామేశ్వరం నర్సిహాృ, నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ రేఖ యాదగిరి, వైస్ ఛైర్మన్ వెంకటేష్ యాదవ్, మణికొండ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొండకల్ల రామకృష్ణారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు క్యాతం అశోక్ యాదవ్, మాజీ ఎంపిటిసి, సీనియర్ టీఆర్‌ఏస్ నేత గొల్ల నాగేష్ యాదవ్, పొన్న రమేష్, గురుస్వాములు రవి కుమార్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్‌లు వచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వాములు, అయ్యప్ప మాలధారులు, భక్తులు పాల్గొని మహా పడిపూజ హారతిని కళ్లకు అద్దుకున్నారు. ఈ సందర్భంగా ఏమ్మేల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ ఆధునిక యుగంలో సైతం ఆధ్యాత్మికతకు యువత పెద్దపీట వేస్తుండడం, మన సంస్కృతి, సాంప్రదాయాలను పాటిస్తుండడం ఆనందంగా ఉందన్నారు. హిందూ సంస్కృతిలోని ప్రతీ పర్వదినం వెనుక ఓ ఆంతర్యం దాగుంటుందని, అది మానవాళికి, సర్వ ప్రాణులకు మేలు చేసేదిగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులతో పాటు వందలాది మంది భక్తజనం పాల్గొని కరుణా హృదయుడు శబరిగిరీశుడి కరుణా కటాక్షాలకు పాత్రులయ్యారు.

# ఘనంగా వార్షిక వేడుకలు

**నదుల ప్రత్యేకతపై ఆకట్టున్న విద్యార్థుల నాటకం**

హైదరాబాద్, డిసెంబర్ 5, ప్రభాతవార్త: మన భారతదేశంలో నదుల ప్రత్యేకతను పవిత్ర నదులను కలుషిత కాకుండా మనదేశ సంపద ప్రజలను కాపాడుకునేందుకు.. పాడిపంటలతో సుభిక్షంగా సస్యశ్యామలం ఏవిధంగా చేయాలో విద్యార్థులు కళ్లకు కట్టినట్లు చూపించిన (నొక్కట్)నాటకం అందరినీ ఆకట్టుకుంది. ఈమేరకు సోమవారం దిక్రీక్ ప్లానెట్‌క్యాంపస్ ఆవరణలో సోమవారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా ఆజాదీ అమృతోత్సవం నేపథ్యంగా తీసుకుని విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముందుగా పాఠశాల ప్రాధానోపాధ్యాయురాలు శిరీష అతిధులతో కలిసి విద్యార్థుల గౌరవ వందనం స్వీరించిజ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు సాంసృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా రైతులకు కూడా జీవజలములు సమృద్ధిగా ఉంటే పంటలు బాగా పండుతాయి.. దేశం బాగా అభివృద్ధి చెందుతుందని విద్యార్థులు నృత్యరూపకంలో ప్రదర్శించిన విధానం స్ఫూర్తిదాయకంగా సాగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిధి అజయ్‌కుమార్ జాదవ్ మాట్లాడుతూ విద్యార్థులకు చక్కటి నైతిక విలువలతో పాటు వారికి మంచి క్రమశిక్షణ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అందించడం శుభపరిణామమన్నారు. అలాగే విద్యార్థులు తమలక్ష్యాలను సాధించేందుకు కష్టపడి చదవాలన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

# బిసిలకు 52శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందే

**బిసి మేధావుల ఫోరం డిమాండ్**

హైదరాబాద్, డిసెంబరు 5,ప్రభాతవార్త: బిసిజనాభా చేపట్టి బిసిలను తక్షణమే 52శాతం రిజర్వేషన్లను పెంచాలని బిసి మేధావుల ఫోరం డిమాండ్ చేసింది. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బిసి రిజర్వేషన్ పోరాట స్టీరింగ్ కమిటీ –బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్పీ) ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. డాక్టర్ సాంబశివగౌడ్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమానికి ప్రొఫెసర్ పి.ఎల్ విశ్వేశ్వర్ రావు, విజెఆర్ నారగోని, బిఎస్పీ రాష్ట్ర కోఆర్డీనేటర్ చంద్రశేఖర్ ముదిరాజ్, ప్రొఫెసర్ ఎం.ఏ మాలిక్, దాసరి హన్మయ్య, రామకృష్ణయ్య పాల్గొన్నారు. ఈసందర్భంగా సాంబశివగౌడ్ మాట్లాడుతూ బిసిలకు 52శాతం రిజర్వేషన్ ఏర్పాటు చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మాణించడం జరిగిందని తెలిపారు. అలాగే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కోటాలో అన్ని కులాలను చేర్చాలన్నారు. బిసిక్రిమిలేయర్‌ను ఎత్తేయాలని, ఉన్నతన్యాయస్థానాల పదవుల్లో బిసి,ఎస్సీ,ఎస్టీలకు అవకాశం కల్పించాలని కోరారు. సమస్యల సాధనకు కోసం త్వరలో అన్ని యూనివర్సిటీలు, జిల్లా మండల కేంద్రాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించి కోటి సంతకాల సేకరణ చేసి బహిరంగ సభ నిర్వహిస్తామని పేర్కొన్నారు.



అభివాదం చేస్తున్న ప్రొఫెసర్ విశ్వేశ్వర్‌రావు, సాంబశివగౌడ్, విజెఆర్ నారగోని తదితరులు

## బంగారు తెలంగాణ కాదు.. తాగుబోతుల తెలంగాణ

**ఆదాయం కోసం ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం**

**ఎక్సైజ్ కమిషనర్‌కు వినతిపత్రం అందచేసిన తెలుగుదేశం పార్టీ మహిళా నాయకులు**





నిరసన తెలుపుతున్న టీడీపీ మహిళా నేతలు

ధర్నాచౌక్, డిసెంబర్ 5, ప్రభాతవార్త: ఎన్నో ఉద్యమాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంను బంగారు తెలంగాణ అంటూ తాగుబోతుల తెలంగాణగా మార్చిన ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని తెలుగుదేశం పార్టీ మహిళా నేతలు ఆరోపించారు. సోమవారం సికింద్రాబాద్ పార్లమెంట్ టీడీపీ మహిళా నేతలు రాష్ట్రంలో ఏరులైపారుతున్న మద్యాన్ని నియంత్రించాలని కోరుతూ ఎక్సైజ్ కమీషనర్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఒక బ్రాందీ దుకాణంగా మార్చి మహిళల అభ్యున్నతికి అడ్డుగోడగా నిలస్తూ ప్రజల ధన ప్రాణాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఘాటుగా విమర్శించారు. మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా చేసుకుని, సర్కారే మద్యం అమ్మకాలను ప్రోత్సహించటం దురదృష్టకరమని అన్నారు. మద్యం మీదనే ఆధారపడి, ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టటం సరికాదని హితవు పలికారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం అమరవీరుల ఆత్మార్పణలతో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో నేడు వైన్ షాపులు, బార్లు, బెల్ట్ షాపులు రాజ్యమేలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్రంలో వచ్చిలవిడి మద్యం అమ్మకాలను నియంత్రించాలని, లేనిపక్షం పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా నేతలు షకీలారెడ్డి, అన్నపూర్ణ, శాంతి, సూర్యదేవర లత, ప్రతిభ, లీలా పద్మావతి, ప్రశాంతి, లక్ష్మి, లలిత, శశిరేఖ పాల్గొన్నారు.

## ధరణి పోర్టల్‌ను వెంటనే రద్దు చేయాలి

### జిల్లా కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ ధర్నా

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 5, ప్రభాతవార్త : రైతులను ఆందోళనకు గురిచేస్తున్న ధరణి పోర్టల్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ముందు టిపిసిసి పిలుపు మేరకు జిల్లా కలెక్టరేట్ ముందు కాంగ్రెస్ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగ పాల్గొన్న మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్ రైతులకు భూములు ఉన్న వారికి శాపంగ మారిందని అన్నారు. రైతాంగంను ధరణి పోర్టల్ మనోవేదనకు గురిచేస్తుందన్నారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలని, ఏకకాలంలో రుణమాఫీ చేయాలని, రైతుల వద్ద నుంచి వరి ధాన్యంను కొనుగోలు చేయాలని అన్నారు. రైతుల పక్షాన కాంగ్రెస్ పార్టీ నిలబడుతుందని, ప్రభుత్వానికి రైతుల తరపున కాంగ్రెస్ పార్టీ నిరసనలు తెలుపుతుందన్నారు. ధరణి పోర్టల్ వచ్చాక భూ సమస్యలు పెరిగాయని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ధరణిని రద్దు చేయకుంటే వచ్చే కాంగ్రెస్ ప్రభుత్వంలో వెంటనే ధరణిని రద్దు చేస్తుందని నందికంటి శ్రీధర్ స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి ఎస్.హరివర్ధన్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గకోఆర్డినేటర్ తోటకూర వజ్రేశ్‌యాదవ్, నియోజకవర్గ పార్టీ నాయకులు, మండలాల, మున్సిపాల్టీల కాంగ్రెస్ అధ్యక్షులు బి.జైపాల్‌రెడ్డి, వై.శంకర్‌గౌడ్, బి.నర్సింలుయాదవ్, ఎంసిపల్లి మండల వైస్‌ఎంపిపి ఎం.శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు జి.వేణుగోపాల్‌రెడ్డి, ఎం.మహేందర్‌యాదవ్, బాల్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, మండల కోఆప్షన్‌సభ్యులు ఎండి ముజీబ్, మాజీ జడ్పీటిసి పి.బాలేశ్, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఆ తరువాత కలెక్టరేట్‌లో కాంగ్రెస్ నాయకులు జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.



బేగంపేటలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సినీ నటి స్నేహాగుప్తా

## నేడు ఉచిత వైద్య శిబిరం

ఖైరతాబాద్, డిసెంబరు 5 ప్రభాతవార్త: అందరూ ఆరోగ్య వంతంగా ఉండాలని ఖైరతాబాద్ మార్కెట్‌లో ఉచిత మెగా శిభిరం నిర్వహించడం జరుగుతుందని మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు పలువురు వైద్యులు రోగులకు సేవలందిస్తారని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రతినిధుల బృందం పేర్కొంది. స్థానికంగా ఉన్న వారందరూ ఇలాంటి ఉచిత వైద్య శిభిరాన్ని సద్వినియోగం చేసుకోవాలంటున్నారు. అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. అంబేద్కర్ వర్ధంతి నిర్వహించి అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలనే తమ దృక్పథం అని వారంటున్నారు.

## ఖైరతాబాద్‌లో ఉచిత కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్

ఖైరతాబాద్, డిసెంబరు 5 ప్రభాతవార్త: ఖైరతాబాద్ ప్రాంతంలోని బడా గణేష్ భవనం వద్ద ఉచిత కంప్యూటర్ సెంటర్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు సింగరి రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన కంప్యూటర్ సెంటర్‌కు అర్హులైన విద్యార్థులు, యువత, మహిళలు పాల్గొన్నారని, కంప్యూటర్ ఫండమెంటల్స్ కమ్ ఎం.ఎస్.ఆఫీస్ న్యూ బ్యాచేస్ వంటివి నిర్వహిస్తున్నామని ప్రతినిధి రాజ్‌కుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

## ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

**ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్**



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ పావనీ వినయ్‌కుమార్

చిక్కడపల్లి, డిసెంబరు 5 ప్రభాతవార్త: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. సోమవారం వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శుద్ధి చేసిన నూతన వెండి వస్తువుల తయారీ ప్రారంభ పూజా కార్యక్రమాన్ని వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై ముఠాగోపాల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. టిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహా, ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ జి.మురళీప్రసాద్, ఈవో మాచర్ల దేవనాథం, ధర్మకర్తలు డాక్టర్ టి.రామకృష్ణ, రమణ, ఎం.గణేష్, పద్మబాసాని, అర్చకులు బుగ్గాలక్ష్మిపతిశర్మ, కందాళ వెంకటాద్రి, ఆచారి, టిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్, ముచ్చకుర్తి ప్రభాకర్, ముచ్చకుర్తి ప్రభాకర్, ముఠానరేశ్, ఎర్రం శ్రీనివాస్‌గుప్త, రవిశంకర్‌గుప్త, బి.ప్రశాంత్, ఎస్.యాదగిరి, బిజెపి నేతలు ఎ.వినయ్‌కుమార్, రత్నాసాయిచంద్, ఉమేశ్, ఆనంద్‌రావు, నర్సింగరావు, సత్తిరెడ్డి, సురేశ్, నవీన్‌కుమార్, నర్సింహా, సాయికుమార్, సంతోష్‌స్వామి, సంయుక్తరాణి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 18న సంక్షేమ సంఘం ఎన్నికలు



సంక్షేమ సంఘం మానిఫెస్టోని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు అందజేస్తున్న కాశీనాథ్ చారి పానెల్ సభ్యులు

యూసుఫ్‌గూడ, డిసెంబర్ 5, ప్రభాతవార్త : గాయత్రి నగర్ సంక్షేమ సంఘ ఎన్నికలు ఈనెల 18వ తేదిన జరగనున్న సందర్భంగా ఇప్పటికే కె కాశీనాథ్ చారి పానెల్ నామినేషన్‌లను దాఖలు చేశారు. ఎన్నికల్లో రూపొందించిన మానిఫెస్టోని సోమవారం స్థానిక శాసన సభ్యులు మాదవరం కృష్ణారావు చేతుల మీదుగా విడుదల చేశారు. కాలనీలలో సంక్షేమ సంఘాలు ప్రజా సమస్యల పరిష్కారానికి ఇటు అధికారులకు ప్రజా ప్రతినిదులకు అటు ప్రజలకు వారధిగా నిలవాలని సూచించారు. ప్రజా సమస్యలకై పోరాడే నాయకులకు ప్రజల నుంచి ఎప్పుడు ఆదరణ ఉంటుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో అధ్యక్షుని అభ్యర్థి కె కాశీనాథచారి, కె.వాసు, మదుసూదన్‌రెడ్డి, ఎమ్‌డి యూసుఫ్, శ్రీలత, జితేందర్ పాల్గొన్నారు.

## సమాజంలోని ప్రతివ్యక్తి ధర్మ మార్గంలో నడవాలి



కార్యక్రమంలో పాల్గొన్న స్వామి శ్రీ యతేంద్ర ఆనంద గిరి

చార్మినార్, డిసెంబరు 5 ప్రభాతవార్త : సమాజంలోని ప్రతీ వ్యక్తి భక్తి మార్గంలో నడవాలని రూడక్ జీవన్ దీప్ ఆశ్రమం పీఠాధీశ్వరులు స్వామి శ్రీ యతేంద్ర ఆనంద గిరి అన్నారు. హైదరాబాద్ నగరానికి విచ్చేసిన స్వామి యతేంద్ర గిరిని పాతబస్తీ కోకరివాడికి చెందిన కుంభమేళ అగ్రబంధు అధ్యక్షులు ఫంకజ్ కుమార్ అగర్వాల్‌తో పాటు పలువురు కలిసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి ధర్మ మార్గంలో నడవాలని కోరారు. కుంభమేళ అగ్ర బంధు ప్రతినిధులు ఫంకజ్ కుమార్ అగర్వాల్, అరుణ్ డకోతియా, రమేష్ అగర్వాల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## గవర్నర్ రాజ్యాంగ ప్రతినిధే.. నరేంద్రమోడీ ప్రతినిధి కాదు

సైఫాబాద్, డిసెంబరు 5 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసైసౌందర్ రాజన్ తాను చేయవలిసిన విధులను నిర్వర్తించకుండా ఎక్కువగా రాష్ట్ర రాజకీయాల్లో జోక్యం చేసుకోవడం వల్ల గవర్నర్ వ్యవస్థను అప్రతిష్టపాలు చేస్తున్నారని సిపిఐ సెక్రెటేరియట్ మెంబర్ వి.ఎస్.బోస్ ఆరోపించారు. గవర్నర్ రాజ్యాంగ ప్రతినిధిఅయినందున రాజ్యాంగం నిర్ధేశించిన నియమ నిబంధనల ప్రకారం విధులు నిర్వహిస్తే ఇటు రాష్ట్ర ప్రజలకు గవర్నర్ పదవికి మేలు జరుగుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాజ్‌భవన్‌లో పనిచేస్తున్న కార్మికులలో 90 శాతం మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారని కాంట్రాక్ట్ లేబర్ చట్ట ప్రకారం వీరందరిని పర్మినెంట్ చేయాల్సి ఉందని, సుప్రీకోర్టు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని తీర్పు ఇవ్వడం జరిగిందని, అటు చట్టం, ఇటు సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ పరిధిలోకి వస్తాయని రాజ్యాంగ ప్రతినిధి అయిన గవర్నర్ ఈ విషయాలను పట్టించుకోకుండా ఏదో మేలు చేస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గవర్నర్ చాన్సలర్‌గా వ్యవహరిస్తున్న ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సెక్యూరిటి విభాగంలో 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న స్థానికులైన కాంట్రాక్ట్ లేబర్‌ను తొలగించి వారి స్తానంలో స్థానికులు కాని కొత్తవారిని నియమించి ఓయూ అధికారులు స్థానికులకు ఉపాధి లేకుండా చేశారని, ఈ విషయంలో గవర్నర్ పట్టించుకోకపోవడం దేనికి నిదర్శమన్నారు. గవర్నర్ రాజ్‌భవన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు, ఓయూలో తొలగించిన ఉద్యోగ, కార్మికులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## యాదాద్రి యాదవ భవన్ వసతి బిల్డింగ్ నిర్మాణం అనుమతులకు మంత్రి కెటిఆర్ చర్యలు

**యాదవ భవన్ ప్రతినిధులు**



మంత్రికెటిఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న యాదవ్ భవన్ ట్రస్ట్ ప్రతినిధులు

తార్నాక, డిసెంబర్ 5 ప్రభాతవార్త: యాదాద్రి యాదవ భవన్ వసతి గృహ నిర్మాణ బిల్డింగ్ అనుమతికి మంత్రి ప్రత్యేక చర్యలు తీసుకున్నారని యాదవ భవన్ ట్రస్ట్, అఖిల భారత యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మణ్ యాదవ్, రాష్ట్ర కోషాధికారి దార బోయిన శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు వారు శనివారం మాట్లాడుతూ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, యాదాద్రి భవన్ ట్రస్ట్ సభ్యులు ఆర్.లక్ష్మణ్ యాదవ్‌ల సహాకారంతో తాము మంత్రి కేటీఆర్‌ను కలిశామని యాదాద్రి యాదవ భవన్ వసతి గృహనిర్మాణానికి అనుమతులు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందన్నారు. అందుకు మంత్రి కేటీఆర్ స్పందించి సంభందిత అధికారులకు వెంటనే అనుమతులు ఇవ్వాలని ఆదేశించడం జరిగిందన్నారు. తాము అడిగిన వెంటనే స్పందించిన మంత్రికి వారు కృతజ్ఞతలు చెప్పారు. ఈ సందర్భంగా కోషాదికారి దారబోయిన శ్రీనివాస్ యాదవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మన్ యాదవ్ తధితరులు ఎంపీ లింగయ్య యాదవ్, దూదిమెట్ల బాల్‌రాజ్ యాదవ్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ తధితరులకు కృతజ్ఞతలు చెప్పారు.

## హామాలీల సమస్యలు పరిష్కరించాలి



మార్కెట్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న హామాలీ యూనియన్ నాయకులు

మెహిదీపట్నం, డిసెంబర్ 5, ప్రభాతవార్త : గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం హమాలీ యూనియన్ సీనియర్ నాయకులు జహంగీర్ సాగర్ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ గ్రేడ్ - 2 అధికారి నరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హమాలీలు మార్కెట్‌లో నిత్యం అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, మౌళిక సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నారని వివరించారు. అనంతరం జహంగీర్ సాగర్ మాట్లాడుతూ గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్‌లో హమాలీలుగా పనిచేస్తున్న వారి సమస్యలను పరిష్కరించడంలో మార్కెట్ అధికారులు పూర్తిగా విఫలం చెందారని ఆరోపించారు. మార్కెట్‌లోని కమీషన్ ఏజెంట్లు హమాలీలను గుర్తించినా...ప్రభుత్వ డాక్టర్లచే ఆరోగ్యపరీక్షలు నిర్వహించిన అనంతరం కూడా హమాలీలకు లైసెన్స్‌ల జారీ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. హమాలీలకు దుస్తువులు, తాగు నీరు, దుమ్ము, ధూళీ, 100 కేజీల బ్యాగుల సమస్యలు ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. మార్కెట్ అధికారులకు అవగాహన లేక పోవడంతోనే సమస్యలు ఎదురవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో సమస్యలను పరిష్కరించకుంటే హమాలీలతో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో హమాలీలు శివం, అశోక్, గంగులు, అన్వర్, అన్ను, గురు తదితరులున్నారు.

## క్రీడలు మానసిక వికాసానికి దోహదం చేస్తాయి

**కరాటే క్రీడ శారీరక ధారుఢ్యానికి ప్రతీక : టీపిసిసి సభ్యులు డా.సత్యంశ్రీరంగం**



క్రీడాకారులకు సర్టిఫికెట్స్ పంపిణీ చేసిన సత్యంశ్రీరంగం

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 5, ప్రభాతవార్త : క్రీడలు మానసిక వికాసానికి దోహదం చేస్తాయని కరాటే క్రీడ శారీరక ధారుఢ్యానికి ప్రత్యేకంగా నిలుస్తుందని టిపిసిసి సభ్యులు డాక్టర్ సత్యంశ్రీరంగం పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో డా.బి.ఆర్. అంబేద్కర్ మెమోరియల్ కప్ 2022 కరాటే అండ్ కుంగ్‌ఫూ ఛాంపియన్‌షిప్, కరాటే మాస్టర్స్ టి.సంతోష్ కుమార్, డి.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిపిసిసి సభ్యులు డా.సత్యంశ్రీరంగం హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ డిస్టిక్ కాజీపేటకి చెందిన ప్రశాంత్ విజేతగా నిలిచి ట్రోఫీని అందుకున్నాడు. బ్లాక్ బెల్ట్ ఫైనల్ విజేతలకు సర్టిఫికెట్స్, ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకలు తూము వేణు, కృష్ణచైతన్య, కరాటే సంస్థ ప్రతినిధులు సత్య శంకర్, సైదులు, చందర్, కన్నగౌడ్, పెద్దఎత్తున శిక్షణ పొందిన విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆడిట్ నివేదికలపై అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు

**ప్రజాధనం ఏలా మాయమైంది : మాజీ వార్డు సభ్యులు జెమ్మి దేవేందర్**

పేట్‌బషీరాబాద్, డిసెంబర్ 5 ప్రభాతవార్త : కొంపల్లి మున్సిపాలిటీలో ప్రజాధనం పక్కదారి పడుతుందని టిఆర్ఎస్ నేత, మాజీ వార్డు సభ్యులు జెమ్మి దేవేందర్ ఆరోపించారు. మున్సిపల్ ఆరంభం నుండి 2021 మార్చి లెక్కల వరకు ఎటువంటి ఆధారాలు, బిల్లులు లేకుండా రూ,9కోట్ల48లక్షల83,347 రూపాయలు ప్రజాధనం ఏలా మాయమైందని ప్రశ్నించారు. ఈమేరకు జిల్లా ఆడిట్ యంత్రాంగంలో బయటపడిన నిజనిర్ధారణలపై సోమవారం మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డికి లిఖితపూర్వకమైన ఆధారాలతో ఫిర్యాదు చేశారు. మున్సిపల్ ఆవిర్భావం నాటి నుండి ఆర్థిక వ్యవహారాలపై జిల్లా ఆడిట్ యంత్రాంగం చేసిన గణంకాలపై అదనపు కలెక్టర్‌తో చర్చించారు. రూ,9కోట్ల48లక్షల83,347 రూపాయల ఆర్థిక వ్యవహారాలు ఎటువంటి ఆధారాలు లేకుండా ఖర్చు అయ్యాయని ఇచ్చిన ఆడిట్ నివేధిక ఆధారంగా తగిన విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎన్నికల నాటి నుండి ఇప్పటి ఆర్థిక సంవత్సరం వరకు జరిగిన అవినీతిపై జిల్లా ఆడిట్ యంత్రాంగం మొదటిసారిగా పనిచేసిన కమిషనర్ ఎంఎన్ఆర్.జ్యోతికి నోటీసులు పంపిందన్నారు. ఆ తరువాత నుండి వచ్చిన ఇతర ఖర్చుల వ్యవహారాలకు సంబంధించిన వాటిపై సైతం జిల్లా ఆడిట్ యంత్రాంగంలో స్పష్టంగా తెలుస్తుందన్నారు. అభివృద్ధి కోసం కేటాయించాల్సిన ప్రజాధనాన్ని ఇలా ఎటువంటి బిల్లులు లేకుండా తారుమారు చేస్తూ దొడ్డి దారిన మళ్ళించిన బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. బడ్జెట్ వ్యవహారాలపై కౌన్సిల్ సమావేశంలో ఏ ప్రాతిపదికన ఆమోదం పొందిందో స్పష్టం చేయాలని కోరారు. దీనికి తోడు అభివృద్ధి పనులు పూర్తైన వాటికి సైతం తిరిగి డబుల్ బిల్లులు పెడుతూ ఏలాంటి టెండర్లు పిలవకుండానే ఇంజినీరింగ్ సెక్షన్ అధికారుల ఇష్టానుసారంగా నిధులు వెచ్చించడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. కొంపల్లి మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై జిల్లా స్థాయి యంత్రాంగం పకడ్బందీగా విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు చేపట్టి పక్కదారి పట్టిన ప్రజాధనాన్ని రికవరీ చేసి ప్రజాభివృద్ధికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్‌ను కోరారు.

## బిజెపి కుట్ర రాజకీయాలను తెలంగాణలో సాగనివ్వం

చిక్కడపల్లి, డిసెంబరు 5 ప్రభాతవార్త: ఎమ్మెల్సీ కవితపై లిక్కర్ కేసు పేరుతో సిబిఐ అధికారుల విచారణ అంటూ పరువుకు భంగం కలిగే విధంగా ప్రచార మాధ్యమాల్లో బిజెపి నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్మికులు, ఉద్యోగులకు టిఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబుయాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని టిఆర్ఎస్‌కెవి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నారాయణ, ఉపాధ్యక్షుడు వేములమారయ్య, రాష్ట్ర కార్యదర్శి కాసాని నాగేశ్వరరావు, గ్రామపంచాయితీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌చారిలతో కలిసి రాంబాబుయాదవ్ మాట్లాడారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నెంబర్‌వన్ స్థానంలో ఉందని, దీనిని చూసి ఓర్వలేక బిజెపి నేతలు, కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతూ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. సిఎం కెసిఆర్ జాతీయ స్థాయిలో బిఆర్ఎస్ పార్టీని ఏర్పాటు చేశారని, నాటి నుంచి బిజెపి ప్రభుత్వం అక్రమంగా కేసులను బనాయించే పనిలోపడిందని, లాభాల్లో ఉన్న ప్రభుత్వరంగసంస్థలను బడా పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. లక్షలకోట్లు బ్యాంక్ డబ్బులు ఎగ్గొట్టిన దొంగలను తమ పక్కన పెట్టుకుని వారందరికి బిజెపి పెద్దలు రుణమాఫి చేస్తున్నారని అన్నారు. దేశంలోని కోట్లాదిది మంది పేద ప్రజలు దాచుకున్న సొమ్ము బడా పెట్టుబడిదారులకు అప్పజెప్పడం ఏ నీతి అని ప్రశ్నించారు. తెలంగాణ తమ పాచికలు చెల్లవని గ్రహించే బిజెపి నేతలు నీతిమాలిన చర్యలు చేస్తే తగిన గుణపాటం చెబుతామని హెచ్చరించారు.

## సిఎం సభ సక్సెస్‌పై సమావేశమైన టిఆర్ఎస్ నాయకులు



ఈ నెల 9వ తేదీన అప్పా జంక్షన్‌లో జరిగే సిఎం సభ విజయవంతంపై మణికొండలో సమావేశమైన టీఆర్ఎస్ నాయకులు

నార్సింగి, డిసెంబర్ 5 ప్రభాతవార్త : ఈ నెల 9.వ,తేదీన తెలంగాణ పోలీసు అకాడమి మైదానంలో జరుగనున్న సీఎం సభను విజయవంతం చేసేందుకు భారీ ఎత్తున జన సమీకరణలు చేయాలని మణికొండ ఫ్లోర్ లీడర్ కొండకల్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమ వారం మణికొండలో మున్సిపల్ అధ్యక్షులు బుద్దోలు శ్రీరాములు నాయకత్వంలో నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశంను నిర్వహించారు. ఈ సందర్బంగా రామకృష్ణారెడ్డి మాట్లాడు తూ పార్టీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులంతా బాధ్యత తీసుకొని పెద్ద ఎత్తున జనాలను తీసుకురావాలని సూచించారు. మున్సిపల్ లోని ప్రతీ డివిజన్ నుంచి కార్యకర్తలు వచ్చేలా చూడాలని, మన మున్సిపల్ నుంచి వెయ్యి మంది వరకు వెళ్లాలని పిలుపునిచ్చారు. పదువులు వచ్చే సమయంలో పోటీ పడడం కాదని, పార్టీ ఆదేశించిన కార్యక్రమాలు విజయవంతం చేయడంలో పోటీలు పడాలని తెలిపారు. పార్టీ కోసం పని చేసిన వారికి తగిన గుర్తింపు అధిష్టానం ఇస్తుందని, ఇప్పటి నుంచి పని చేసే వారికే పదవులు వస్తాయని రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. నాయకులు సమిష్టిగా కష్టపడాలని సీఎం సభ విజయవంతం కోసం అంకిత భావంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వసంత్ చౌహాన్, జైరాజ్, రూపారెడ్డి, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కేజీ నుంచి పీజీ ఉచిత విద్యను ప్రభుత్వం అందించాలి

**భారతీయ విద్యార్థి మోర్చ తెలంగాణ రాష్ట్రకమిటీ సమావేశం**



సమావేశంలో పాల్గొన్న భారతీయ విద్యార్థి మోర్చ తెలంగాణ రాష్ట్రకమిటీ ప్రతినిధులు

చిక్కడపల్లి, డిసెంబరు 5 ప్రభాతవార్త: భారతీయ విద్యార్థి మోర్చ తెలంగాణ రాష్ట్రకమిటీ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ బట్టు అధ్యక్షతన సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రాష్ట్ర మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా సత్యశోధక్ రాష్ట్ర అధ్యక్షుడు బట్టి చెన్నయ్య హాజరుకాగా విశిష్ట అతిథులుగా బిఎంఎం రాష్ట్ర కార్యదర్శి రాజేష్ రక్షక్, ఐఎల్‌పిఏ రాష్ట్ర కార్యదర్శి మాధవ కృష్ణారెడ్డి, అంసోల్ లక్ష్మణ్, డాక్టర్‌నరేందర్ పవర్, రవితేజతో పాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి రాహుల్, జివిఎం విఠల్, బుల్లెట్ నరేశ్, ప్రవీణ్, దినేష్, నిజామ్ కళాశాల నాయకులు రణదీప్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు తీర్మాణాలను ఆమోదించారు. కేజీ నుంచి పీజీ ఉచిత న్యాయమైన విద్యను ప్రభుత్వం అందించాలని, ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌లు రద్దు చేయాలని, దుర్మార్గమైన నూతన జాతీయ విద్యావిధానాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని, అధునాతన పద్దతుల ద్వారా పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలను, సంక్షేమ హాస్టళ్ళను నిర్మాణం చేయాలని, ఎస్సీ,ఎస్టీ, ఓబీసీ మైనారిటీ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, బాబాసాహెబ్ అంబేద్కర్ మరణించి 66 సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు ఆ మరణ నివేదికను ఇవ్వకపోవడం దురదృష్టకరమని సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. విద్యాపరిరక్షణ కోసం సామాజిక పరివర్తన కోసం విద్య, వైద్యంను పేదలకు ఉచితంగా అందించాలని డిమాండ్ చేసింది.

## బస్తీలలో మెరుగైన వైద్యసేవలు



పర్వత్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఉచిత వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరిక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ దివాకర్

యూసుఫ్‌గూడ, డిసెంబర్ 5, ప్రభాతవార్త : పేదలు నివసించే బస్తీలలో వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు గాను ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి సేవలు అందించడం జరుగుతుందని డాక్టర్ దివాకర్ అన్నారు. సోమవారం పర్వత్‌నగర్ కమ్యూనిటి హాల్‌లో హ్యాండ్ ఆఫ్ హోప్ ఆసుపత్రి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆశ్రయం ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిభిరాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని వైద్య పరిక్షలు నిర్వహించుకున్నారు. ఇందులో జనరల్ , డెంటల్ కంటికి సంబందించిన, ల్యాబ్ పరిక్షలు ఎక్స్‌రే, తదితర వంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అవసరమయిన వారికి ఉచిత కంటి ఆపరేషన్‌లు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాధిక, రవితేజ, డాక్టర్ తేజస్విని, డాక్టర్ రణీల, డాక్టర్ జవహర్, డాక్టర్ స్వరూప, పర్వత్‌నగర్ సంక్షేమ సంఘం అద్యక్షులు జాహేద్ షరీఫ్, ఎ మనెమ్మ, తదితరులు పాల్గొన్నారు.



భారత మాజీ తొలి రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ జయంతి సందర్భంగా సికింద్రాబాద్‌లో సమావేశమైన బీహార్ సమాజ్ సేవాసంఘ్ ప్రతినిధులు పరామనందశర్మ, ఎస్ఎన్ శర్మ, జశ్వంత్‌సింగ్, అజయ్‌ఓజా, రాజుఓజా

## ఆసరా పెన్షన్ కోసం బార్లు తీరిన లబ్దిదారులు



పెన్షన్ కోసం పోస్టుఆఫీస్ వద్ద లైన్లు కట్టిన లబ్దిదారులు

నిజాంపేట, డిసెంబర్ 5 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వృద్దులకు, దివ్యాంగులకు అందిస్తున్న ఆసరా పెన్షన్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు ఇస్తారో తెలియక లబ్దిదారులు పోస్టుఆఫీస్ వద్ద పడిగాల్పులు పడుతున్నారు. పెన్షన్ డబ్బులు సంబంధిత లబ్దిదారుని బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని తెలిపి వివరాలు తీసుకున్నప్పటికి నేటి వరకు ఆచరణ నోచుకోలేదు. మారుమూల గ్రామాల్లో పెన్షన్ బ్యాంకులో జమ అవుతున్న నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మాత్రం అందుకు భిన్నంగా ఉంది. రోజుల తరబడి ఎదురుచూస్తూ లబ్దిదారులు పోస్టుఆఫీస్ చుట్టూ ప్రదిక్షణలు చేస్తున్నారు. ఈవిషయాన్ని ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్ళిన ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పెన్షన్ డబ్బులు లబ్దిదారుల ఖాతాలో నేరుగా జమ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని లుక్స్ గ్లోబల్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ బిక్షపతియాదవ్ డిమాండ్ చేశారు.

## సమస్యలను త్వరితంగా పరిష్కరిస్తాం: సురేష్‌రెడ్డి



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి

జీడిమెట్ల, డిసెంబర్ 5 ప్రభాతవార్త : సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రియాంకనగర్‌లో సోమవారం మాజీ కార్పొరేటర్, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు సురేష్‌రెడ్డి పాదయాత్ర నిర్వహించి స్థానికులు ఎదుర్కోంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ సంబంధితశాఖ అధికారులతో చర్చింది కాలనీలో నెలకొన్న సమస్యలను త్వరితంగా పరిష్కరిస్తానని పేర్కోన్నారు. కార్యక్రమంలో సంక్షేమసంఘం నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## పత్తికుంట తూమును వెంటనే తెరువాలి

**అదనపు కలెక్టర్‌కు వినతి**

నిజాంపేట, డిసెంబర్ 5 ప్రభాతవార్త : బాచుపల్లి మండల పరిధిలోని పత్తికుంట తూము, పార్కు స్థలాలు, ప్రభుత్వ స్థలాలపై అదనపు కలెక్టర్ నర్సింహిరెడ్డికి సోమవారం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఉమామహేష్, మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో ప్రభుత్వ స్థలాలు కనుమరుగవుతున్నాయన్నారు. బాచుపల్లి మండల పరిధిలోని పత్తికుంట తూముని, అలుగును మూసి వేసి కబ్జాలకు పాల్పడుతున్నారని పత్తికుంట తూమును వెంటనే తెరువాలని పేర్కోన్నారు. అలాగే పలుచోట్ల పార్కు స్థలాలను సైతం కబ్జాలకు పాల్పడుతున్నారని ఈవిషయమై తగు విచారణ చేపట్టి చేర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు డిల్లేశ్వరరావు, శ్రీనివాస్, మల్లయ్య, యాదయ్య, శివ, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

## ఐటిఐ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన



కార్యక్రమంలో కాలాపత్తర్ సిఐ ఎన్.బుచ్చయ్య మాట్లాడుతున్న దృశ్యం

చార్మినార్, డిసెంబరు 5 ప్రభాతవార్త : విద్యార్దులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కాలాపత్తర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎన్.బుచ్చయ్య అన్నారు. పాతబస్తీ రంనాస్‌పురలో ఉన్న ప్రభుత్వ ఐటిఐలో సోమవారం ఏర్పాటు చేసిన కమ్యూనిటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ విద్యార్దులు కష్టపడి చదివితే తప్పకుండ ఉన్నత శిఖరాలకు చేరకుంటారని తెలిపారు. ప్రభుత్వ ఐటిఐ విద్యార్దులకు ఆయన సైబర్ నేరాలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ హెచ్.నరేష్, ఐటిఐ కళాశాల స్టాఫ్, విద్యార్దులతో పాటు పలువురు పాల్గొన్నారు.

## గాయనీ ఎస్‌పి.శైలజకు 'ఘంటసాల శతజయంతి పురస్కారం' ప్రదానం

చిక్కడపల్లి, డిసెంబరు 5 ప్రభాతవార్త: రాగరాగిణి సాహితీ, సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో అమరగాయకులు పద్మశ్రీ ఘంటసాల వేంకటేశ్వరరావు శతజయంతి సందర్భంగా ప్రముఖ సినీ నేపధ్య గాయనీ ఎస్‌పి.శైలజకు 'ఘంటసాల శతజయంతి పురస్కారం' ప్రదానం చేయబోతున్నట్లు నిర్వాహక సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వి.రమణకుమారి, ఎం.వి.సుబ్బలక్ష్మి వివరించారు. ఏపి అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబుఅధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పూర్వ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు హాజరై ఈ పురస్కారాన్ని అందిస్తారని, సభను ప్రముఖ గాయనీ, భీమన్న సాహితీ నిధి అధినేత్రి హైమావతి భీమన్న ప్రారంభిస్తారన్నారు. విశిష్ట అతిథులుగా ప్రఖ్యాత కూచిపూడి నృత్యకళాకారిణి పద్మశ్రీ డాక్టర్ పద్మజారెడ్డి, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఎస్.అంజయ్య, జాతీయ మానవహక్కులు, యాంటీ క్రైం కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఆర్.రామమూర్తి నాయుడు, ప్రముఖ సినీ పరిశోధకులు సంజయ్‌కిషోర్ తదితరులు పాల్గొంటారన్నారు. 'పాటే మంత్రము' ఘంటసాల, ఎస్‌పి.శైలజ పాడిన పాటలతో 'సినీ గీత విభావరి' కార్యక్రమంలో గాయనీ గాయకులు ఎం.వి.రమణకుమాంరి, శశిరేఖ, హిమజ, శశికాంతి,ఎన్.బి.ఖాసిమ్, కె.సుధాకర్, హరికృష్ణ తదితరులు గానం చేస్తారన్నారు.

## ట్రాన్స్‌జెండర్లు, సెక్స్‌వర్కర్లను ఓటరుగా నమోదు చేయించాలి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 5, ప్రభాతవార్త : ట్రాన్స్జెండర్లను, సెక్స్‌వర్కర్లను ఓటరుగా నమోదు చేయించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డి సూచించారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ లోని ఆయన ఛాంబర్‌లో జిల్లా సంక్షేమ అధికారు లతో స్వీప్ అధికారులు, జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 18సంవత్సరాలు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఈ నెలలో నాలుగు రోజుల పాటు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.

# మానవ మనుగడకు మూలాధారం మట్టే

ధర్నాచౌక్, డిసెంబర్ 5, ప్రభాతవార్త: మానవ మనుగడకు మూలాధారం మట్టే నని, అటువంటి మట్టిని కాపాడుకుంటేనే భవిష్యత్ తరాలు సురక్షితంగా ఉంటా యని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం ప్రపంచ భూపరిరక్షణ దినో త్సవం సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై ఇంగ్లీష్ యూనియన్ హైస్కూల్ మరియు ఇషా ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో భూపరిరక్షణ–మానవ మనుగడ అనే అంశంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇంగ్లీష్ యూనియన్ హైస్కూల్ ప్రిన్స్‌పాల్ స్వర్ణలతతో కలసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం మానవాళి ముందున్న ముప్పు మట్టి అంతరించిపోవటమేనని, దీని ఫలితంగా ఆహారాన్ని పండించే సామర్థ్యం భూమి కోల్పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మనకు ప్రకృతి ప్రసాదించిన ఈ వనరు మానవ మనుగడకు ఎంతో కీలకమైనదని గుర్తు చేశారు. ఒక గుప్పెడు మట్టి తయారు కావటానికి ఎన్నో ఏళ్లు పడుతుందని, అటువంటి విలువైన వనరును కాపాడుకోవటం మన బాధ్యతగా గుర్తించాలని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా 7కోట్ల ఐదు వందల టన్నుల సారవంతమైన భూమిని కోల్పోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇషా ఫౌండేషన్ ప్రతినిధులు ప్రియదర్శిని, అభిరామ్, రేఖ, అఖిల్, పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణవేణి, ప్రతిభ, వందన, ప్రసన్న, అనూరాధ, భాస్కర్, విజయ్‌కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.



ఫొటోరైటప్: భూపరిరక్షణ అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్న పులిగారి గోవర్ధన్‌రెడ్డి, స్వర్ణలత తదితరులు

# గిరిజన శక్తి ఛలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గిరిజన శక్తి అధ్యక్షులు శరత్ నాయక్ ఇతర నేతలు

తార్నాక, డిసెంబర్ 5 ప్రభాతవార్త: గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్‌నాయక్ ఆధ్వర్యంలో వచ్చే విద్యా సంవత్సరానికి తెలంగాణలో ట్రైబల్ యూనివర్సిటీని ప్రారంభించాలని కోరుతూ ఈ నెల 12,13 తేదీల్లో చలో డిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నామని శరత్ నాయక్ పేర్కొన్నారు. అందుకు సంభందించి శనివారం సాయంత్రం ఓ.యూ ఆర్ట్స్ కాలేజ్ ముందు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గిరిజన శక్తి వ్యవస్థాపక అధ్యక్షులు వెంకటేష్ చౌహాన్, రాష్ట్ర అధ్యక్షులు శతర్ నాయక్, ఉపాధ్యక్షులు డా. భూక్యా రాజారం నాయక్ మాట్లాడుతూ ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్రంలో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఏపీలో ఏర్పాటు చేసిన కేంద్రం ఇక్కడ మాత్రం ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా వచ్చే విద్యా సంవత్సరంలోగా ఇక్కడ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలన్నారు. లేనిచో బీజేపీ నాయకులను తండాల్లో అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నరేష్ నాయక్, ఓ.యూ అధ్యక్షులు హనుమంతు నాయక్, కార్యదర్శి సుమన్ నాయక్, జిల్లా అధ్యక్షుడు జెడి నాయక్, నవీన్, సురేష్‌నాయక్, బాలాజీ నాయక్,సోనునాయక్, అరుణ్ నాయక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## సినీ రచయిత పి.సత్యానంద్‌కి 'ఆదుర్తి ఆత్మీయ ప్రతిభాపురస్కారం'

హైదరాబాద్, డిసెంబర్ 5 ప్రభాతవార్త: తెలంగాణ భాషా సాంస్కృతిక సౌజన్యంతో 'సాంస్కృతిక బంధు' సారిపల్లికొండలరావు సారథ్యంలో యువకళావాహిని ఆధ్వర్యంలో గ్రేట్ డైరెక్టర్ ఆదుర్తి సుబ్బారావు శతజయంతి, మహానటి సావిత్రి 87వ జయంతి, సూపర్‌స్టార్ కృష్ణ సంస్మరణ సందర్భంగా ఆదుర్తి సుబ్బారావు పరిచయం చేసిన ప్రముఖ సినీ రచయిత పి.సత్యానంద్‌కి 'ఆదుర్తి ఆత్మీయ ప్రతిభాపురస్కారం' అందించబోతున్నట్లు నిర్వాహక సంస్థ అధినేత, వ్యాఖ్యాన వాచస్పతి లంకా లక్ష్మినారాయణ వివరించారు. డిసెంబరు 6న రవీంధ్రభారతిలో జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వసలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి హాజరై ప్రదానంచేస్తారని, 'సాంస్కృతిక బంధు', డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు నాటకకళాపరిషత్ అధినేత సారిపల్లి కొండలరావు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో దూరదర్శన్ పూర్వ సంచాలకులు డాక్టర్ పాలకుర్తి మధుసూదన్‌రావు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులుఉ డాక్టర్ మామిడిహరికృష్ణ, ఆధుర్తి గ్రంథ రచయిత హెచ్.రమేశ్‌బాబు, సావిత్రి గ్రంథ రచయిత్రి జి.పల్లవి తదితరులు పాల్గొంటారన్నారు. ఆదుర్తి–కృష్ణ–సత్యానంద్ కలయికతో సూపర్‌హిట్ మూవీ 'మాయదారి మల్లిగాడు' చిత్ర ప్రదర్శన ఉంటుందన్నారు.

# రోడ్లను మరమ్మత్తు చేయించిన అడ్డగుట్ట బిజెపి నేతలు



అడ్డగుట్టలో రోడ్ల మరమ్మత్తులు చేయిస్తున్న బిజెపి నాయకులు రాజుగౌడ్, హంసరాజ్ తదితరులు

కంటోన్మెంట్, డిసెంబర్ 5 ప్రభాతవార్త: అడ్డగుట్ట డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో అధ్వాన్నంగా ఉన్న రోడ్లను మరమ్మత్తులు చేయాలని సికింద్రాబాద్ అసెంబ్లీ బిజెపి ఓబిసి కన్వీనర్ నాగపూరి రాజు గౌడ్, బిజెపి ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి జి.హంసరాజ్‌లు తెలిపారు. సోమవారం అడ్డగుట్ట, తుకారాంగేట్, సాయి నగర్ ప్రాంతాల్లో గుతంలమయంగా ఉన్న రోడ్లను జిహెచ్‌ఎంసి అధికారులు మరమ్మత్తులు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ విన్నపం మేరకు అడ్డగుట్టలో గుంతలమయంగా ఉన్న రోడ్లు మరమ్మత్తులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఆర్.నందు, లల్లూ, సుందర్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి తలసాని హయాంలోనే అభివృద్ధి : గుర్రం పవన్



పద్మారావు నగర్‌లో 10 లక్షల వ్యయంతో డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కార్పోరేటర్ హేమలత, టిఆర్ఎస్ ఇన్‌ఛార్జి గుర్రం పవన్ తదితరులు

కంటోన్మెంట్, డిసెంబర్ 5 ప్రభాతవార్త: రాష్ట్ర మంత్రి, సనత్ నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, సహాయ సహకారాలతో బన్సీలాల్‌పేట్ డివిజన్ కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి జరుగుతుందని కార్పోరేటర్ కురుమ హేమలత, పద్మారావ్ నగర్ టిఆర్ఎస్ ఇన్‌ఛార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్‌లు తెలిపారు. సోమవారం పద్మారావ్ నగర్‌లోని సమోసా పార్కు వద్ద రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పద్మారావ్ నగర్ టిఆర్ఎస్ ఇన్‌ఛార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్, జలమండలి డిజిఎం క్రిష్ణ, టిఆర్ఎస్ నాయకులు రాజు, బాబురావ్, నర్సింగ్‌రావ్, శైలేందర్ పాల్గొన్నారు.

# బెతెల్ గోస్పెల్ చర్చిలో క్రిస్మస్ సంబరాలు



క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలు పంపిణి చేస్తున్న దూసరి శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, డిసెంబరు 5 ప్రభాతవార్త: గోల్నాక డివిజన్‌లోని బెతెల్ గోస్పెల్ చర్చిలో సోమవారం నిర్వహించిన క్రిస్మస్ సంబరాల్లో టిఆర్ఎస్ రాష్ట్ర సినీయర్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని క్రిస్మస్ కానుకులను క్రైస్తవులకు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ సుధాకర్, జేసన్‌రాజు, వరకుమార్, టిఆర్ఎస్ సినీయర్ నాయకులు నర్సింగ్‌యాదవ్, గోపాల్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ దేశాలలో భారతీయ మహిళకు ప్రత్యేక గుర్తింపు

## మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సంజీవరెడ్డి నగర్, డిసెంబర్ 5, ప్రభాతవార్త : ప్రపంచ దేశాలలో భారతీయ మహిళకు ప్రత్యేక గుర్తింపు ఉన్నదని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. సోమవారం అమీర్‌పేటలో కొత్తపల్లి మధుసూదన్‌రావు, విజయలక్ష్మీ దంపతులు రచించిన అమృత వర్షిణి పుస్తకాన్ని మంత్రి శ్రీనివాస్‌యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచారాలు, సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనంగా తెలుగింటి మహిళలను పేర్కొన్నారు. మహిళ లేనిదే సమాజంలేదనే వాస్తవాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. ఒక అమ్మగా, ఒక బిడ్డగా, మహిళలు చేసిన త్యాగాలు, వారు అందించే సేవలు వెలకట్టలేనివని అన్నారు. అనేకమంది మహిళలు అనేక పోరాటాలు, త్యాగాలతో చరిత్రలో గొప్పవారిగా నిలిచారన్నారు. మహిళలు గొప్పతనాన్ని, వారి సేవలను తెలియజెప్పే విధంగా ఎంతో అద్భుతంగా అమృత వర్షిణి పుస్తకాన్ని రచించిన మధుసూధన్‌రావు దంపతులను మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. ఒక వ్యాపారిగానే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాలలో కూడా ఎల్లప్పుడూ మధుసూధన్‌రావు ముందుంటారని ప్రశంసించారు. ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నప్పటికీ స్వచ్ఛందంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అనేక మందికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. నీలోఫర్ కేఫ్ నిర్వహకులు బాబురావు ఒక్కరూపాయికే వైద్యం అందిస్తున్న గంగాధర్‌గూప్తా, పేదలకు ఉచితంగా భోజనం అందిస్తున్న ఎస్సార్‌నగర్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ తదితరుల గురించి మంత్రి ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ నామన శేషకుమారి, రమేష్, టిల్లుబాయి, విజయలక్ష్మీ, ప్రభాకర్, శ్రీనివాస్, ప్రసాద్, శైలజ, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

# ఏఐఐసీ చర్చిలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

యూసుఫ్‌గూడ, డిసెంబర్ 5, ప్రభాతవార్త : పాపులను రక్షించడానికి ఏసుక్రీస్తు ఈ లోకానికి మానవ రూపంలో జన్మించారని ఆల్ ఇండియా ఇండిపెండెంట్ చర్చిస్ దయాసిస్ నిర్వాహకులు, ఇండియన్ బిలివర్స్ పార్టీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ బిషప్ సెబాస్టియన్ తెలియజేశారు. ఇండియన్ బిలీవర్స్ పార్టీ, ఆల్‌ఇండియా ఇండిపెండెంట్ చర్చిస్ దయాసిస్ ఆధ్వర్యంలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఏఐఐసీ చర్చిలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బిషప్ సెబాస్టియన్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు రక్తం ద్వారా మనకు పాప విమోచన జరుగుతుందని తెలియజేశారు. ఈలోకంలో ఆయన శాంతి మార్గాన్ని ప్రజలకు చూపించాడని ఆయన మార్గంలో నడిచినట్టయితే ఒకరిపట్ల ఇంకొకరికి సోదరభావం, శాంతి, సమానత్వం, ప్రేమ మరింతగా పెరుగుతాయని అన్నారు. సెమిక్రిస్మస్ వేడుకల్లో భాగంగా ప్రత్యేక గీతాలను ఆలపించారు. నూతన సంవత్సరం క్యాలెండర్‌ను కూడా ఆవిష్కరించారు. అనంతరం క్రిస్మస్ కేక్‌కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిషప్ నూనె వినోద్ బిషప్ ఆరుణ్, బిషప్ సునీల్, ఐబీపి వరంగల్ జిల్లా అధ్యక్షులు రెవరెండ్ డాక్టర్ ఇమ్మానియేలు, పాస్టర్ యోబు, కృపాకర్, సుదర్శన్‌లతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పాస్టర్లు, క్రిస్టియన్ భక్తులు పాల్గొన్నారు. అనంతరం సెమీ క్రిస్మస్‌కు హాజరైన పాస్టర్లు, పాస్టరమ్మలకు చీరలు, బ్యాగులు పంపినీ చేశారు.



ఆలిండియా ఇండిపెండెంట్ చర్చెస్ డయాసిస్‌లో సెమి క్రిస్మస్ వేడుకల్లో నూతన సంవత్సర కాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ బిషప్ హ్యారి షబాష్టియన్

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 5, ప్రభాతవార్త : శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని వివేకానందనగర్ డివిజన్‌లో గల రిక్షాపుల్లర్స్ కాలనీలో జీవై ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉచిత వైద్య శిబిరంలో కంటి పరీక్షలు, వైద్యం, మందులు పంపిణీ తదితర కార్యక్రమంలో వందల సంఖ్యలో రోగులు పాల్గొన్నారు. మేడ్చల్ మల్కాజగిరి అర్బన్ జిల్లా బిజెపి ఎస్సీ మోర్చా సెక్రటరీ అశోక్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని ఆర్‌పికాలనీలో జీవై ఫౌండేషన్ ద్వారా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గజ్జల యోగానంద్ మానవసేవే మాధవసేవ అని పేదలకు తనవంతు సహకారం అందించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన జీవై ఫౌండేషన్ ద్వారా మెడికల్ క్యాంపు, ఉచిత కంటి పరీక్షలు, ఉచిత మందులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగానంద్ మాట్లాడుతూ ఎంతో మంది వ్యాధిని గుర్తించలేక వైద్యానికి దూరమవుతూ అనేక రోగాల బారినపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోగికి వచ్చిన వ్యాధిని గుర్తించలేక హాస్పిటల్‌కి వెళ్ళే స్తోమత లేక దుర్భరమైన జీవితం గడుపుతూ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని గజ్జల యోగానంద్ విచారం వ్యక్తం చేశారు. కుటుంబ పోషణలో భాగంగా రోజుకూలి పనులకు వెళ్ళి సరైన ఆహారం లేక ఈ కాలుష్యం వలన రోగాల బారినపడుతున్నారని అన్నారు. అలాంటి వారికి వెన్నుదన్నుగా ఉంటూ జీవై ఫౌండేషన ఆధ్వర్యంలో ఉచితంగా వైద్యసేవలు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మద్యపానానికి దూరంగా ఉండాలని, చెడు అలవాట్లకు బానిసలు కావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాకల్పన ఏకాంత్ గౌడ్, ఏకాంత్‌గౌడ్, శ్రీహరియాదవ్, గణేష్ గౌడ్, భీమయ్యగౌడ్, భానుయాదవ్, దయాకర్‌రెడ్డి, జితేందర్, బి.శ్రీను, మల్లేష్, వినోద్, సంధ్య, ఉపేంద్ర, శాలిని తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

# పేద ప్రజలకు భూ పంపిణీ చేయించిన ఘనత జస్టిస్ భీమపాకదే

చిక్కడపల్లి, డిసెంబరు 5 ప్రభాతవార్త: బంధు సొసైటీ, మాదిగ మేధావుల ఫోరం, యునైటెడ్ దళిత ఫ్రంట్ తెలంగాణ రాష్ట్ర కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నగేష్‌కు ఆత్మీయ సన్మాన కార్యక్రమం సొసైటీ అధ్యక్షుడు పి.వీరస్వామి అధ్యక్షతన బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగింది. యునైటెడ్ దళిత్‌ఫ్రంట్ అధ్యక్షుడు ఆరేపల్లి రాజేందర్, ఎంఐఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ స్వాగత ఉపన్యాసం చేశారు. పేద ప్రజల కోసం తన తండ్రి చేసినటువంటి సేవలను గుర్తుచేస్తూ భీమపాక భూపతిరావు ఉద్యమస్ఫూర్తి, సేవాస్ఫూర్తి తన తనయుడు భీమపాక నగేశ్‌లో కనిపిస్తున్నాయన్నారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలోని పాలేరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై తనకు ప్రభుత్వపరంగా వచ్చిన గౌరవ వేతనాన్ని సిపిఐ ఇచ్చి కేవలం రూ.800 జీతంతో జీవితం గడిపిన ఘనత భూపతిరావుకే దక్కుతుందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిక్కార్సైన ఎమ్మెల్యేగా పాలేరు నియోజకవర్గం నుంచి ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి పేద ప్రజలకు భూమి కోసం దీక్షచేసి రాజమండ్రి జైలుకు వెళ్లి జైలులో దీక్ష కొనసాగించి 500 ఎకరాల భూమి సాధించి పేద ప్రజలకు అప్పగించిన ఘనత భూపతిరావుకే దక్కుతుందన్నారు. తండ్రిబాటలోనే తనయుడు నగేశ్ పేద ప్రజల పక్షపాతిగా న్యాయశాస్త్ర పట్టా పొందినప్పటి నుంచి పేద ప్రజల కోసం ఏజెన్సీ ప్రాంతమైన కొత్తగూడెం చుట్టుపక్కల గ్రామాల్లో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసినప్పటి నుంచి ప్రజలకు తన సొంత ఖర్చులతో 100, 150 కిలోమీటర్ దూర ప్రాంతాలకు వెళ్లి పేద వారి తరుపున కేసులు వాదించి న్యాయం జరిగేలా చూసేవారన్నారు. పేద ప్రజలకు భూపంపిణీ చేయించిన ఘనత జస్టిస్ భీమపాక నగేష్‌గారిదన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ జె.అజయకుమార్, దళిత్‌ఫ్రంట్ కార్యదర్శి దూలపల్లి వాణి, సంయుక్త కార్యదర్శి మెలుగు రాజు, బంద్‌సొసైటీ కార్యదర్శి ఎర్ర దేవదానం, ఎంఐఎఫ్ కార్యదర్శి ప్రొఫెసర్ నాతనేయల్, ప్రొఫెసర్ డాక్టర్ చక్రపాణి(గాంధీ ఆసుపత్రి), ఉస్మానియా విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్ణాహుతి, చక్రతీర్థం..రథోత్సవం

ఘట్‌కేసర్, డిసెంబర్ 5, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ బాలాజీనగర్‌లోని గీతామందిర్‌లో సోమవారం పూర్ణాహుతి, చక్రతీర్థస్నానం ఘనంగా జరిగింది. శ్రీశివరామకోటి జపయజ్ఞ సర్వాధ్యక్షులు శ్రీసదానందయోగీశ్వరులు ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. హారేరామ నామ సప్తాహం ముగింపు, యజ్ఞపూజ, సామూహిక గీతాహవనం, ఆశీర్వాద ప్రసంగాలు, పూర్ణాహుతి, స్వామి పుష్పయాగోత్సవం ఘనంగా జరిగింది. ఆదివారం శ్రీరాధాకృష్ణులలీలా కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం వెంకటేశ్వరస్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. బాలాజీనగర్‌లో కరీంగూడ మీదుగా పలు వీధుల్లో రథంపై స్వామిని ఊరేగించారు. శ్రీభగవద్గీతా భక్త సమాజం సభ్యులు, కళాకారుల కోలాటం, భక్తుల గోవింద నామస్మరణ మధ్య స్వామి రథం సాగింది. గత నెల 28 నుంచి ఇక్కడ జరుగుతున్న బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిసాయి.

# సనత్‌నగర్ డివిజన్‌లో ఓటరు నమోదు ప్రక్రియ

సంజీవరెడ్డి నగర్, డిసెంబర్ 5, ప్రభాతవార్త : ఆదివారం సనత్‌నగర్ డివిజన్ దాసారం బస్తీలో సనత్‌నగర్ కార్పోరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓటరు నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు గుర్తింపు కార్డును తీసుకోవాలని ఆయా జిల్లాల నుంచి వచ్చిన వారు ఓటరు కార్డును సరిచేసుకొని ఓటరు గుర్తింపు ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, షాబాద్ శ్రీనివాస్, దాసారం బస్తీ గుడిసెల సంఘం అధ్యక్షులు బంధం విశ్వనాథ్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యసేవల్లో ఆధునిక టెక్నాలజీ వినియోగం

హైదరాబాద్, డిసెంబరు 5,ప్రభాతవార్త: ఆరోగ్య సేవలరంగంలో ఆధునిక సాంకేతికను వినియోగించి రోగులకు మెరుగైన వైద్యసేవలందించేందుకు కృషి చేస్తున్నామని ఆస్టర్‌డియం హెల్త్‌కేర్ రీజనల్ సిఈవో కె.వేవానంద్ అన్నారు. ఈమేరకు నూతన టెక్నాలజీతో అందుస్తున్న వైద్యసేవలపై ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఆస్టర్‌ప్రైమ్‌లో చికిత్సఅనంతరం డిశ్చార్జి అయ్యాక ఇంటికి చేరుకున్న రోగులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో రూపొందించిన టెక్నాలజీని ఉపయోగించి రోగి స్థితిగతులను తెలుసుకుని సరైన సమయంలో తగిన చికిత్స అందించే విధంగా టెక్నాలజీని వినియోగిస్తున్నామన్నారు. అందుకు హెప్స్‌అనే హెల్త్‌కేర్ టెక్నాలజీ సంస్థతో ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. ఈటెక్నాలజీ రోగి సమాచారం సేకరించడం, విశ్లేషించడం, హెచ్చరికలు జారీ చేయడం తొందరగా సాధ్యమవుతుందని దీంతో వారిని హైరిస్క్ నుంచి తప్పించేందుకు వీలుంటుందని పేర్కొన్నారు.

### శారదా నర్సింగరావుకు

## భక్తిరత్న అవార్డు

హైదరాబాద్, డిసెంబరు 5,ప్రభాతవార్త: ప్రవచనకర్త శారదా నర్సింగరావుకు భక్తిరత్న అవార్డు లభించింది. ఈమేరకు ఆదివారం రాత్రి జియాగూడ ఏకేభవన్‌లో జరిగిన భగవద్గీత ప్రవచనలహరి అనే కార్యక్రమానికి త్రిదండి శ్రీనివాసవ్రతధర నారాయణస్వామీజీ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు రమణాచారి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా ప్రవచనకర్త నర్సింగరావుకు అవార్డుతో సత్కరించారు. ఈకార్యక్రమంలో జియాగూడ కార్పొరేటర్ బోయిని దర్శన్, ఆచార్య జయ రాములు, మహాత్మా గోపాల్ పరమానంద పాల్గొన్నారు.

## నేడు తత్కాల్ పాస్‌పోర్ట్ సేవలు

హైదరాబాద్, డిసెంబర్ 5,ప్రభాతవార్త: పాస్‌పోర్టు సమస్యలు, సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ఈనెల 6న (మంగళవారం)ఉదయం 10గంటల నుంచి తత్కాల్ పాస్‌పోర్ట్ సేవలను అందించనున్నట్లు రీజనల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ దాసరి బాలయ్య తెలిపారు. ఈమేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఆకాశవాణి, ఫోన్‌ఇన్ ద్వారా సేవలు అందిస్తామని ఈసందర్భంగా తమ కార్యాలయం ఫోన్ నెంబర్లు 040-23244834, 040-23244836, 040-29704324 కు ఫోన్‌చేసి సమస్యలను పరిష్కరించుకోచ్చునని పేర్కొన్నారు.

## సుబ్రహ్మణ్య శర్మ పదవులకే వన్నె తీసుకువచ్చారు

సైఫాబాద్, డిసెంబరు 5 ప్రభాతవార్త: దేశంలో ఏపదవి చేపట్టినా పాలనాదక్షత ప్రతిభకు ప్రతీకగా ప్రసార భారతి పూర్వ సిఇఒ డా.సుబ్రహ్మణ్యశర్మ నిలిచారని కేంద్ర హోం శాఖ మాజీ కార్యదర్శి కె.పద్మనాభయ్య ప్రసంసించారు. ప్రముఖ రసమయి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ విశ్రాంత ఉన్నతాధికారి సామాజిక తత్వవేత్త డా.పిఎల్ సంజీవరెడ్డి 82వ జయంతి సభ సోమవారం సాయంత్రం రవీంద్రభారతిలో జరిగింది. పద్మనాభయ్య సంజీవరెడ్డి సార్మక పురస్కారాన్ని సుబ్రహ్మాశర్మకు బహుకరించి మాట్లాడారు. సంజీవరెడ్డి ఆర్థిక శాఖ నిపుణుడిగా దేశంలో ఎగుమతులపై విశేషంగా కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన పాలనా రంగానికి సంబంధించిన పలు పుస్తకాలను రాయడం జరిగిందని అవి నేటికి సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు మార్గదర్శకంగా పనిచేస్తున్నాయని చెప్పారు. అంతకు ముందు ఆదాయ పన్నుల శాఖ విశ్రాంత ప్రధాన కమిషనర్ నరసింహప్ప మాట్లాడుతూ సమాచార రంగంలో సమాచార భారతి అధికారిగా సంచలనాత్మక మార్పులను సుబ్రహ్మణ్యశర్మ తీసుకువచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రసమయి వ్యవస్థాపక అధ్యక్షుడు డా.ఎంకె రాము, కోటయ, అశాలత తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC

నిట్ నం. సంక్షిప్త టెండరు ప్రకటన నం.: 09/EE/PDSZ-I/GHMC/2022-23, తేది: 03.12.2022 (7 రోజులు) (పునఃపిలుపు), పనిపేరు: ఒవైసీ పై ఓవర్ సంతోష్‌నగర్ వైపు కొత్త ర్యాంపు (ఎడమవైపు భాగం) నిర్మాణం కోసం సాధ్యాసాధ్యాల నివేదిక తయారీ మరియు DPR కోసం ప్రతిపాదిత కన్సల్టెన్సీ సేవల కోసం ఆహ్వానం (పునఃపిలుపు). బిడ్ల స్వీకరణకు ప్రారంభ మరియు చివరి తేది మరియు సమయము : బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభం : 05.12.2022న సా.4.00గం.లు. డౌన్‌లోడ్ ముగింపు : 13.12.2022న మ.1.00గం.లు. బిడ్‌ల స్వీకరణకు చివరి తేది మరియు సమయము: 13.12.2022న మ.1.30గం.లు. బిడ్ తెరుచుట: 13.12.2022న మ.2.00గం.లు. సంబంధిత అధికారి పేరు మరియు చిరునామా, సెల్ నెం. శ్రీ డి.సురేష్, EE, PD SZ-I, GHMC, ఆబిడ్స్, హైదరాబాద్. 7995009112. మరిన్ని వివరములకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.tender.eprocurement.gov.in పై చూడవచ్చును.

DIPR.No.9799-PP/CL/Advt/1/2022-23 తేది: 05.12.2022 సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, ప్రాజెక్టు డివిజన్ SZ-I, GHMC.



**బహిరంగ ప్రకటన**

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు **శ్రీ జహంగీర్ S.K., తండ్రి జంగీర్ సాబ్,** వయస్సు సుమారు 45 సం॥లు, వృత్తి: వ్యాపారము, నివాసం: ఆరుట్ల గ్రామము, మంచాల మండలము, రంగారెడ్డి జిల్లా వారు, తమ యొక్క తండ్రి, తల్లి మరియు సోదరులతో సహా రంగారెడ్డి జిల్లా, మంచాల మండలము, ఆరుట్ల రెవెన్యూ గ్రామంలో గల సర్వే నెం.లు 927, 987, 988, 989, 991, 992, 993, 995 మరియు 1105 లలో మొత్తం ఎ॥ 56 గుం॥ల విస్తీర్ణం గల భూమికి ఉమ్మడి యజమాని మరియు పట్టాదారుగా ఉన్నారు. అంతేకాకుండా తెలియజేయునది ఏమనగా పైన తెలిపిన ఆస్తి నా క్లయింటు మరియు అతడి కుటుంబం యొక్క ఉమ్మడి ఆస్తిగా మాత్రమే ఉండి, మరెవరికీ తెలుపబడిన ఆస్తి పై ఎటువంటి హక్కుయూ లేదు. నా క్లయింటునకు ఇటీవల కాలంలో తెలియవచ్చినది ఏమనగా, కొంత మంది వ్యక్తులు తెలుపబడిన ఆస్తిని కొనుగోలు చేయుటకు ప్రయత్నించుచున్నారు. కావున, తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు యొక్క సమ్మతి లేకుండా కుటుంబ సభ్యులతో లావాదేవీలు లేదా పరిశీలన జరిపిన పక్షంలో అట్టిది వారి స్వంత బాధ్యతపై ఆధారపడి ఉంటుంది మరియు అట్టి వారు చట్టప్రకారం శిక్షార్హులుగా ఉంటారు.

సం/– (బాలకృష్ణ ఉప్పునంతల) న్యాయవాది

కార్యాలయం: ప్లాట్ నెం.6, రోడ్ నెం.8–బి, మధురానగర్ కాలనీ, బి.ఎన్.రెడ్డి నగర్, హైదరాబాద్–500058, సెల్: 9177952356.



**బహిరంగ ప్రకటన**

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది మరియు ప్రకటించునది ఏమనగా, నా క్లయింటు T.S. హైదరాబాద్ కాచీగూడ, నింబోలి అడ్డా, నానామియాన్ చౌడీ వద్ద G+2 అంతస్తుల యొక్క 115 చ॥గజాల విస్తీర్ణం ఆస్తి M.No.3-2-207 మరియు 3-2-208 కలిగిన భూమి మరియు భవనం కొనుగోలుకు ఉద్దేశించినారు మరియు M.No.3-2-207 మరియు 3-2-208 కలిగి ఉన్న 126.82 చ॥గజాల విస్తీర్ణం ఆస్తి T.S. హైదరాబాద్ కాచీగూడ, నింబోలి అడ్డా, నానామియాన్ చౌడీ వద్ద G+2 అంతస్తులు కలిగిన భూమి మరియు భవనం ఆస్తిని **శ్రీ కేసరి ప్రభాకర్** నుండి విలువైన విక్రయం పరిగణన ఉద్దేశించినారు. ఎవరైనా వ్యక్తి(లు) పై ఆస్తికి సంబంధించి ఎటువంటి హక్కు, టైటిల్ లేదా ఆసక్తి కలిగి ఉన్నట్లయితే వారి అభ్యంతరాలను ఈ ప్రచురణ తేదీ నుండి 6 రోజులలోగా తెలియచేయవలెను, లేదా లేనట్లయితే మా క్లయింటు ఇష్టప్రకారం లావాదేవీలు పూర్తి చేయబడును ఆపైన ఎటువంటి అభ్యంతరాలు వచ్చినా వాటికి హక్కు లేనట్లుగా పరిగణింపబడటం జరుగుతుందని తెలియజేస్తున్నారు.

సం/– G. జగదీష్, న్యాయవాది

కార్యాలయం: 10–5–420/2, ఫస్ట్ లాన్సర్, అహ్మద్‌నగర్ హైదరాబాద్–500028, సెల్ నెం.09248585914 ఇ–మెయిల్: shalax9@gmail.com



**IN THE COURT OF THE HON'BLE VIII ADDITIONAL SENIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT AT : L.B.NAGAR**
**LAOP. No. 26 OF 2014**

Between:
**The Spl. Dy. Collector (LA),** ORR. HMDA, Tarnaka, Hyderabad ...Referring Officer
AND
**Chandra Prabha Devi & Others** ...Claimants

To
1. **Chandra Prabha Devi,** R/o Vatinagullapally(V), Rajendra Nagar(M), Ranga Reddy District.
2. **Sathaiah** S/o Mallaih, R/o Vatinagullapally(V), Rajendra Nagar(M), Ranga Reddy District.
4. **Rachuri Venkataiah,** R/o Vatinagullapally(V), Rajendra Nagar(M), Ranga Reddy District.
6. **Goda Balaiah,** R/o Vatinagullapally(V), Rajendra Nagar(M), Ranga Reddy District.
7. **Goda Srishailam,** R/o Vatinagullapally(V), Rajendra Nagar(M), Ranga Reddy District.
...Claimants

Please take notice that the above LAOP referred U/Sec.30 & 31 of LA. Act by the LAO in respect of land in Sy.No.258 situated at Vattinagulapally Village, Rajendra nagar Mandal, Ranga Reddy District and posted to 12.12.22 for your appearance. Therefore, make it convenient to present yourself either in person or through authorized agent before the above mentioned Court at 10.30 A.M. on 12.12.22. Otherwise, the matter will be decided in exparte.

(By Order of the Court)
**Sd/- S.SRINIVAS RAO**
**Standing Counsel for HMDA**
**Cell: 9848996066**



**IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE : MEDCHAL MALKAJGIRI DISTRICT UPPAL AT L.B.NAGAR**
**O.S.NO. 1705 of 2022**

**Between :**
Smt. Sathi Saroja & 2 others. ...Plaintiffs
And
1. Tha Tahsildar, Uppal Revenue Mandal, Medchal Malkajgiri District.
2. All Concerned. ...Defendants

To
1. Tha Tahsildar, Uppal Revenue Mandal, Medchal Malkajgiri District.
2. All Concerned.

**NOTICE**

Please take notice that the plaintiffs have filed the above suit for declaration to declare the plaintiffs as the legal heirs of late Sri Sathi Eshwar Reddy S/o. late Sri S.Venkat Reddy in respect of the suit schedule property before the Hon'ble II Additional Junior Civil Judge: Medchal-Malkajgiri District, Uppal at L.B.Nagar. The matter is posted to 22-12-2022 at 10.30 A.M. for your appearance either in person or through counsel, failing which the matter will be decided as per law.

**SCHEDULE PROPERTY**

All that part and parcel of house plot No. 73 in survey number 87/2, admeasuring 167 square yards or 139.61 square meters, situated at Block No.4, Jaipuri Colony, Nagole Village, Uppal Mandal under L.B.Nagar Municipality, Medchal-Malkajgiri District erstwhile Ranga Reddy District and bounded by:- North : Plot No. 72, South : Plot No. 74, East : 20' wide Road, West : Plot No. 82 & 81.

**(BY ORDER OF THE COURT)**
**Sd/-. K.Ashok Reddy,** Advocate
F.No. 103 at 3-4-543 & 544, Lakshmi Nilayam, Narayanaguda, Hyderabad - 500027. **Cell 9440623917.**



**IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT, AT: L.B.NAGAR**
**O.S.NO. 354 OF 2017**

**Between :**
NALLI VENKATAMMA And another ...PLAINTIFFS
AND
RAMAVATAR KAMALA PERSHAD GOYAL And others ...DEFENDANTS

To
D-1 RAMAVATAR KAMALA PERSHAD GOYAL, HUF Rep Kamalapershad Goyal,S/o Ramavatar Goyal, Aged about 75 years, R/o H.No.21-1-845, Rekabgunj, Hyderabad.
D-2 PUSPA GUPTA, W/o Yatindranath Gupta, Aged about 69 years, Occ: Household R/o H.No.5-8-287, Maheshnagar Colony, Hyderabad – 500 001.
D-4 MEENA DEVI GOYAL, S/o Late Laxminarayana Goyal, Aged about 66 years, Occ: Housewife, R/o 19-1-874/4, Bahadurpura, Hyderabad.
D-8 SRUSHTI GOYAL, D/o Late Laxminarayan Goyal, Aged about 28 years, Occ: Student R/o 19-1-874/4, Bahadurpura, Hyderabad.

**NOTICE**

The Plaintiffs had filed the above suit for Declaration and Perpetual Injunction against the Defendants including you in respect of Suit Schedule Property mentioned therein. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above suit and the matter is posted to 15.12.2022 or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law. Hence, this Notice.

**[BY ORDER OF THE COURT]**
**Sd/- K.AMARNATH REDDY, K.MAHENDER** Advocates
Indraprastha Colony, L.B.Nagar, Ranga Reddy District.



**IN THE COURT OF THE HON'BLE IV ADDL. SENIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT, AT L.B.NAGAR**
**O.S.NO. 616 OF 2022**

**Between :**
Smt. Bingi Sayamma And Others ...Plaintiffs
**AND**
1. The Dy. Commissioner, GHMC, Circle-5, Saroornagar, R.R.District.
2. All Concerned ...Defendants

To
D-2 All Concerned

Take notice that the Plaintiffs filed the above suit for Declaration declaring the Plaintiffs are the absolute Owners and Possessors of the SUIT SCHEDULE PROPERTY being the Legal Heirs and Successors of Late Bingi Mallaiah, S/o. Bingi Ramaiah. Who died on 11-08-2010 and the suit is stands posted to 27/12/2022. If any person or persons having any Objections or Claims they may appear before the above Court on 27/12/2022 at 10.30 a.m. either in person or through an Advocate, failing which the matter will be decided basing on the documents available on record.

All that the House bearing Nos. 11-11-456 and 11-11-456/1 (Old House Nos. 11-11-70/3/A and H.No. 11-11-70/3/B), consisting of Ground + First Floor, over the Land bearing Plot Nos. 322/3 and 322/4 admeauring 250 Sq.yards, in Sy.No.9/1 (Old) (New Sy. No.9/1/G), situated at Road No.7, Telephone Colony, Saroornagar, Ranga Reddy District - 500 035 and bounded by : NORTH : House on Plot No.323. SOUTH : House on Plot No.322/2. EAST : House on Plot No.3. WEST : 40' feet wide Road.

**(BY ORDER OF COURT)**
**Sd/- M/s. A.Vinod Rao, S.V.Chary.** Advocates, Hyd. Counsel for the Plaintiffs.

## రూ. 84 లక్షలతో సిసి రోడ్డు పనులు ప్రారంభం : ఎమ్మెల్యే బేతి



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేతి, కార్పొరేటర్ రజితరెడ్డి

**ఉప్పల్, డిసెంబరు 5 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ హనుమసాయినగర్‌కాలనీలో రూ.84లక్షలతో చేపడుతున్న సిసిరోడ్డు పనులను సోమవారం ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ ఎం.రజితపరమేశ్వర్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమసాయినగర్ కాలనీలో ఇప్పటికే రూ.30లక్షలతో డ్రైనేజీ పనులు పూర్తి చేశామని, త్వరలోనే సిసి రోడ్ల పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం కాలనీలో పర్యటించి పలు సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ నాగేందర్, డిఇ నిఖిల్‌రెడ్డి, జలమండలి మేనేజర్ సత్యనారాయణ; టిఆర్ఎస్ నేతలు వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, గరిక సుధాకర్, వి.సంతోష్‌రెడ్డి, సుధాకర్, చిలుగూరి శ్రీకాంత్, కాలనీ సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

## జిఓ 118పై బిజెపి నాయకులు కుటిల రాజకీయాలు మానుకోవాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిఆర్ఎస్ నాయకులు

**వనస్థలిపురం, డిసెంబరు 5 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా అర్బన్ బిజెపి అధ్యక్షుడు సామ రంగారెడ్డి అర్థంలేని కుటిల రాజకీయాలు చేస్తున్నారని హస్తినాపురం కార్పొరేటర్ సుజాతానాయక్, మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, టిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, చింతల రవికుమార్‌లు ఆరోపించారు. గత రెండు రోజుల క్రితం జిఓ 118 తప్పుడు జిఓ అని సామ రంగారెడ్డి, బిజెపి కార్పొరేటర్లతో కలిసి ప్రకటన చేయడాన్ని ఖండిస్తూ టిఆర్ఎస్ నాయకులు వనస్థలిపురంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడుతూ ప్రజలకిచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఎంతో శ్రమతో మంత్రి కెటిఆర్ చొరవతో ఇచ్చిన 118 జిఓను తీసుకువచ్చారన్నారు. అందులో 90శాతం కాలనీవాసులకు న్యాయం జరుగుతుందని, మిగిలిన 10 శాతం ప్రజలకోసం మార్పుకోసం పంపారని త్వరలో పూర్తిస్థాయిలో అందరికీ న్యాయం జరిగేలా జిఓ వస్తుందన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేకనే బిజెపి నాయకులు అవగాహన లేకుండా మాట్లాతున్నారన్నారు. ఈ సమావేశంలో టిఆర్ఎస్ నాయకులు సత్యంచారి, చిరంజీవి, మల్లారెడ్డి, రాజిరెడ్డి, సంగీతప్రశాంత్, రాజునాయి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణ కాలనీలో సమస్యలు లేకుండా చర్యలు : శాంతి శేఖర్



సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ శాంతి శేఖర్

**నాచారం, డిసెంబర్ 5 ప్రభాతవార్త:** నాచారం డివిజన్ అన్నపూర్ణకాలనీలో సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు, కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పేర్కొన్నారు. శనివారం అన్నపూర్ణ కాలనీలో ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పర్యటించి స్థానికులచే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, సీసీరోడ్డును వేయాలని అధికారులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో డిఈ రూపా, అసిస్టెంట్ ఇంజనీర్ లింగారావు, జలమండలీ మేనేజర్ సందీప్, నాయకులు సాయిజన్ శేఖర్, మల్లేష్ యాదవ్, విఠల్ యాదవ్, శ్రీశైలం యాదవ్, ముత్యం రెడ్డి కైలాష్, సురేష్ తధితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి : శ్రీవాణి



సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి అంజన్‌కుమార్

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 5 ప్రభాతవార్త :** డివిజన్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను విడతలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ పేర్కొన్నారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, ఇంజనీరింగ్, జలమండలి, శానిటేషన్ అధికారులతో కలిసి సోమవారం జెబీ కాలనీ, శ్రీ వెంకటేశ్వర కాలనీలలో పర్యటించి సమస్యల గురించి అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులకు వాటిని పరిష్కరించే విధంగా చరయలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఈ ప్రశాంతి, మేనేజర్ లెనిన్, కాలనీ ప్రతినిధులు రవీందర్ రెడ్డి, మాధవరెడ్డి, వెంకటేశ్వరరావు, మారయ్య, విష్ణు భగవాన్ రాజు, తివారి తదితరులు పాల్గొన్నారు.

## కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వం : కారింగుల మారుతి



సమావేశంలో మాట్లాడుతున్న మారుతి

**మలక్‌పేట, డిసెంబరు 5 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వంకక్ష సాధింపుచర్యలకు పాల్పడుతుందని టిఎస్ఆర్టీసి లైసెన్స్‌డ్ పోర్టర్స్ యూనియన్ అధ్యక్షుడు కారింగుల మారుతి పేర్కొన్నారు. కేంద్రం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ పోర్టర్స్ యూనియన్ నాయకులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రం కక్ష సాధింపు చర్యలతో ఎమ్మెల్సీకవితపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించమని వెంటనే చర్యలు విరమించుకోవాలని సూచించారు.

## రాజకీయాలకతీతంగా డివిజన్లలో అభివృద్ధి : మేయర్ పారిజాత



యుజిడి పనులను ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, డిసెంబర్ 5 ప్రభాతవార్త:** రాజకీయాకతీతంగా బడంగ్‌పేట్ కార్పొరేషన్‌ను అభివృద్ధి చేస్తున్నామని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. కార్పొరేషన్‌లోని 8వ డివిజన్ జయసూర్యపట్నంలో డ్రైనేజీ నిర్మాణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కార్పొరేటర్ గూడెపు ఇంద్రసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మహిళలతో కలిసి డ్రైనేజీ పనులను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్లను రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేయడం జరుగుతున్నదని తెలిపారు. ప్రజలకు మౌళిక సదుపాయాలను కల్పించడానికి ప్రాధాన్యతనిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో 23వ డివిజన్ కార్పొరేటర్ రాళ్ళగూడెం సంతోష శ్రీనివాస్‌రెడ్డి, సంక్షేమ సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## లక్ష్మీ గణపతి ఆలయంలో గీతా జయంతి



గీతా జయంతి పూజలు నిర్వహిస్తున్న ఎంవి కృష్ణారావు

**సరూర్‌నగర్, డిసెంబర్ 5 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని శివసాయినగర్ శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి సమేత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో గీతాజయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ చెరువు హరిశ్రీ పినాకపాణిశర్మ భగవద్గీత ప్రాముఖ్యత గురించి అదేవిధంగా కుమారి దీప్తి భగవద్గీత శ్లోకాల సారాంశాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ తీగల సుభాష్‌రెడ్డి, కమిటీ సభ్యులు సంతోష్‌రెడ్డి, వెంకట కృష్ణారావు, వెంకటరమణ, ప్రధాన అర్చకులు వడ్లమాని లక్ష్మీ గణపతి రావు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ తల్లి ఆలయానికి భూమి పూజ : ఎమ్మెల్యే మంచిరెడ్డి



భూమి పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి తదితరులు

**తుర్కయంజాల్, డిసెంబర్ 5 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో కాశమోనిగుట్టలో ఎల్లమ్మ తల్లి ఆలయానికి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, డిసిసిబి వైస్ చైర్మన్ కొత్తకుర్మా సత్తయ్య, కౌన్సిలర్ మేతరి అనురాధ దర్శన్ నాయకులతో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ మాజీ డైరెక్టర్ కందాడ ముత్యం రెడ్డి, మున్సిపాలిటీ కౌన్సిలర్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ రామావత్ కళ్యాణ్ నాయక్, కందాడ లక్ష్మారెడ్డి, చెక్క బాల నరసింహ, మేతరి స్వామి, చెక్క మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## బిజెపితోనే పేదలకు న్యాయం : మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్

**ఉప్పల్, డిసెంబరు 5 ప్రభాతవార్త :** బిజెపితోనే పేదలకు న్యాయం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం చిలుకానగర్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు గోనె శ్రీకాంత్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో పలువురు పార్టీ నేతలు బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని మోడీ నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలువుతున్నాయని, తెలంగాణలో కూడా వచ్చే ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి వస్తుందన్నారు. చిలుకానగర్‌కు చెందిన పార్టీ నేతలు అనంతుల వెంకటేష్, అద్దంకి వెంకటేశ్వర్లు, మక్కల ప్రభు, నాంపల్లి అశోక్, కాసుల రామకృష్ణ గౌడ్, అఖిల్, శ్రీకాంత్, పులి శ్రీనివాస్, పత్తి ఉపేందర్, సాయిబాబా, సతీష్ తదితరులతో పలువురు బిజెపిలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు గోనె అంజయ్య, అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్, చంద్రయ్య, దత్తుసాయి. సుమన్‌నాయక్, చోటేమియా, రాంరెడ్డి, బాలరాజు,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు

**హయత్‌నగర్, డిసెంబరు 5 ప్రభాతవార్తః** లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పేద, మధ్యతరగతి ప్రజలకోసం సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగించడం అభినందనీయమని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 4వ వార్డు కౌన్సిలర్ వద్దేపల్లి విద్యావతివిజేందర్‌రెడ్డి అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ (కృష్ణానగర్) ఆధ్వర్యంలో 4వ వార్డుపరిధి శాంతినగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం ఆడపిల్లలకు సమకూర్చిన పలకలు, గుడ్లు, నూనెలు, ఆహార దాన్యాలను ఆమె అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... లయన్స్ క్లబ్ ప్రతినిధులు కొనసాగిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో లయన్ క్లబ్ అధ్యక్షులు గణేష్, సెక్రటరీ రఘునాథరెడ్డి, కోశాధికారి బాలయ్య, సభ్యులు శివారెడ్డి, రమణ పాల్గొన్నారు.

## మంచినీటి లీకేజీలు అరికట్టాలి

**ఉప్పల్, డిసెంబరు 5 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్‌లో మంచినీటి లీకేజీలు అరికట్టి నీటి సరఫరా ప్రెషర్ పెంచాలని కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ సూచించారు. ఈ మేరకు సోమవారం చిలుకానగర్ డివిజన్‌లోని బాలాజీ ఎన్‌క్లేవ్‌లో మేనేజర్ అసిఫ్‌అలీ, రాజులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డివిజన్‌పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎయిర్ వాల్వ్‌లు ఏర్పాటుచేసి జంక్షన్లకు మరమ్మతులు చేయాలని సూచించారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పిందచమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్‌నాయకులు బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, కొండల్‌రెడ్డి, కె.జగన్, బింగి శ్రీనివాస్, రాంచందర్, సుందర్,శ్యామ్, పుష్పరాజ్, అజయ్, పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## యాదవ స్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలని వినతి : ఎమ్మెల్యే



ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావుకు వినతి పత్రం అందిస్తున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, నాయకులు

**నేరెడ్‌మెట్, డిసెంబర్ 5 ప్రభాతవార్త:** మల్కాజిగిరి నియోజకవర్గపరిధిలోని వినాయక్‌నగర్‌డివిజన్ ఈస్ట్ కాకతీయనగర్‌లో శ్మశానవాటిక సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి, నాయకులు, కాలనీవాసులు ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఎదుర్కుంటున్న శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలన్నారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే జోనల్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి రూ. 48లక్షల రూపాలయను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, డీఇ లౌక్య, ఏఈ సత్యలక్ష్మి, నాయకులు పిట్ల శ్రీనివాస్,జీఎన్‌వి సతీష్‌కుమార్,గుండా నిరంజన్, సంతోష్, రాందాస్, ప్రభాకర్, అశోక్, వెంకటేష్, నర్సింగ్‌రావు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

**చంద్రగిరి కాలనీలో పర్యటన:** అనంతరం చంద్రగిరి కాలనీలో పర్యటించి కాలనీ ప్రజలు ఎదుర్కుంటున్న కమ్యూనిటీ హాల్, రోడ్లు, బాక్స్‌డ్రైన్, ట్రాన్స్‌ఫార్మర్ తదితర సమస్యలను పరిష్కరిస్తా_నన్నారు.

## జలమండలి ఎండితో కార్పొరేటర్ శ్రీవాణి బేటి



జలమండలి ఎండి దానకిషోర్‌ను కలిసి వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి తదితరులు

**రామంతాపూర్, డిసెంబరు 5 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్‌లోని పలుప్రాంతాల్లో మంచినీటి పైప్‌లైన్లు మంజూరు చేయాలని కోరుతూ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ సోమవారం జలమండలి ఎండి దానకిషోర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీవాణి మాట్లాడుతూ రామంతాపూర్ డివిజన్‌లోని శ్రీనగర్‌కాలనీలో కొత్త సివరేజీ పైప్‌లైన్లు, భరత్‌నగర్, సత్యనగర్, సాబేరాకాలనీలో మంచినీటి పైప్‌లైన్లు వేయాలని కోరారు. కాలనీ ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నా ఇంతవరకు సరైన నీటిసదుపాయం కల్పించడం లేదని, డ్రైనేజీ వ్యవస్థ కూడా సరిగ్గా లేదని, వెంటనే స్పందించి నిధులు కేటాయించాలని విన్నవించారు. దీనిపై జలమండలి ఎండి దానకిషోర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్రావ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## వడ్డెర్లకు రావాల్సిన వాటా కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తాం



సమావేశంలో పాల్గొన్న వడ్డెర సంఘం నాయకులు

**తుర్కయంజాల్, డిసెంబర్ 5 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ తొర్రూరు గ్రామ పరిధిలో సోమవారం వడ్డెర్ల ఆత్మ గౌరవసభ నిర్వహించారు. ఈ సభకు జిల్లా అధ్యక్షులు పందిగోటి ఎల్లయ్య హాజరై మాట్లాడుతూ బందరావిరాల 268 సర్వేనెంబర్‌లో పది గ్రామాల ప్రజలకు రావాల్సిన 670 ఎకరాల 29గుంటలు భూమిని గత ప్రభుత్వం 2004 లో మైనింగ్ జోన్ ఏర్పాటు చేసారని, అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో 10 గ్రామాల వడ్డెర ప్రజలకు 10శాతం కింద 66ఎకరాల 43గుంటల భూమిని ఇవ్వడం జరిగింది. దీనిని ఒక బందరాల గ్రామానికి ఇవ్వడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తక్షణమే విరమించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేసారు. వడ్డెర కులస్తులకు రావాల్సిన వాటా కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మెకం అంజయ్య, వడ్డెర సంఘం అధ్యక్షులు ఈ సురేష్, రమేష్, పాల్గొన్నారు. అనంతరం తొర్రూర్ గ్రామ వడ్డెర సంఘం కమిటీని ఎన్నుకోన్నారు. గ్రామ అధ్యక్షుడిగా సంపంగి నాగరాజు, ఉపాధ్యక్షుడిగా సాతుల మారి, ఇతర సభ్యులుగా హనుమంతు, శివ, నాగరాజు, రమేష్, బాలాజీ, హనుమంతు, యాదయ్య, వెంకటేష్ తదితరులను నియమించారు.

## ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక దైవచింతన అలవర్చుకోవాలి : మంత్రి సబితారెడ్డి



మంత్రి సబితారెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న చంద్రశేఖర్‌గుప్తా

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 5 ప్రభాతవార్త :** ఆర్‌కెపురం డివిజన్ వాసవి కాలనీలోని ఆధ్యాత్మిక కేంద్రంలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రి సబితారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక దైవచింతన అలవర్చుకోవాలన్నారు. అనంతరం మంత్రిని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ గుప్తా, అంజయ్య గుప్తా, చిలుక ఉపేందర్‌రెడ్డి, టిఆర్ఎస్ నాయకులు మురుకుంట్ల రవీందర్‌శర్మ, పెండ్యాల నగేష్, మారం సుజాత రెడ్డి, జగన్, శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# అత్యుత్తమ ప్రమాణాలతో 'ముక్తి ఘాట్ '

## నేడు ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్



అత్యుత్తమహంగులతో నిర్మించిన ముక్తి ఘాట్ దృశ్యం

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 5 ప్రభాతవార్త:** భారత దేశంలోనే మొట్టమొదటి అత్యంత ఆధునిక హంగులతో నాగోల్ డివిజన్ ఫతుల్లాగూడలో స్మశాన వాటిక(ముక్తి ఘాట్) నిర్మాణం పూర్తి చేశారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఈ కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత నిస్తూ వేగవంతంగా పనులు పూర్తిచేయించారు. మంగళవారం ముక్తి ఘాట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ హాజరవుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. కుల మత అంతరాలను పక్కనపెట్టి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన మేరకు సర్వమతాలకు సంబంధించిన ముక్తి ఘాటును నిర్మించారు. ఏ మతస్థుడు, ఏ కులస్తుడు మరణించిన అనంతరం అంతిమంగా స్మశానంలోకి వెళ్లాల్సిందే. బతికినన్ని రోజులు కులాల గోడలు, మతాల గోడలు నిర్మించుకొని ఆ గోడల మధ్యనే ఉండిపోతున్నారు. మరణం అనంతరమైన మరణించినవారి మధ్యన గోడలు తొలగిస్తూ ఎల్బీనగర్ లోని ఫతుల్లాగూడాలో ముక్తి ఘాటును నిర్మించి కులాల గోడలు, మతాల గోడలు లేకుండా పక్క పక్కనే హిందూ, ముస్లిం, క్రిస్టియన్ల స్మశాన వాటికలు నిర్మించడం ప్రత్యేకత సంతరించుకుంది. స్మశానవాటికలో జరిగే దహన సంస్కారాలలో ఎవరైనా మరణిస్తే దూరప్రాంతాలు, విదేశాల్లో ఉన్న ఆప్తులు, బంధుమిత్రులు కనీసం చివరిచూపుకోసం నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచంలో ఏ మూలన ఉన్న సెల్‌ఫోన్‌లో అంతిమ సంస్కారం వీక్షించే ఏర్పాట్లు చేశారు. స్మశాన వాటిక పర్యావరణానికి అనుకూలంగా సోలార్ విద్యుత్తు ఏర్పాటు. అంతిమ సంస్కారం అనంతరం స్నానాలు, టాయిలెట్స్ కోసం ఉపయోగించిన వృధా నీటిని రీసైకిలింగ్ చేసి తిరిగి ఆ స్మశాన వాటికలో ఉన్న చెట్లకు ఉపయోగిస్తారు. ఇక్కడ బ్యాండ్, డప్పులు, వాయిద్యాలు, శబ్దకాలుష్యంపై నిషేధం భారతదేశానికే మోడల్‌గా నిలుస్తుంది. ఒక్క కర్ర అవసరం లేకుండా అత్యంత ఆధునిక హంగులతో స్మశానవాటిక ఏర్పాటు చేశారు. ఈ స్మశాన వాటిక భారతదేశంలోనే మొట్టమొదటిదిగా అవుతుంది. మనిషి మరణిస్తే అంతిమ సంస్కారం చాలా గౌరవప్రదంగా, ఆహ్లాదంగా ఉండి వీడ్కోలు చెప్పాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన చేశారని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు.

## ఎంవిఎస్ఆర్ ప్రొఫెసర్ ప్రసన్నకుమార్‌కు భీష్మాచార్య అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ ప్రసన్నకుమార్

**సరూర్‌నగర్, డిసెంబర్ 5 ప్రభాతవార్త:** ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీల్లో ఒకటైన నాదర్‌గుల్ ఎంవిఎస్ఆర్ కళాశాలకు చెందిన ప్రొఫెసర్ ప్రసన్నకుమార్‌కు భీష్మాచార్య అవార్డు లభించింది. గత 34 సంవత్సరాలుగా వివిధ హోదాల్లో కళాశాలో సేవలందిస్తున్న ఆయనను ఆదివారం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన భారత్ ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్-2022 కార్యక్రమంలో భీష్మాచార్య అవార్డుతో సన్మానించారు. ప్రసన్నకుమార్‌కు అవార్డు దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేసిన ఎంవిఎస్ఆర్ కాలేజీ ఛైర్మన్ డాక్టర్ కెపి శ్రీనివాసరావు,సెక్రటరీ ఎం.కృష్ణకుమార్, కోశాధికారి సుధాకర్, ప్రిన్సిపాల్ జి.కనకదుర్గ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్‌జిఎస్ మూర్తి, హెచ్ఓడిలు అధ్యాపకులు అభినందించారు.

## మాణికేశ్వరీనగర్ బస్తీలో ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



డిప్యూటీ మేయర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న అయ్యప్పస్వాములు

**తార్నాక, డిసెంబర్ 5 ప్రభాతవార్త:** మాణికేశ్వరీనగర్ బస్తీలోని ఏడు గుళ్ల ఆలయంలో అయ్యప్పస్వాములు ఏర్పాటు చేసిన అయ్యప్ప మహాపడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మహా పడిపూజా కార్యక్రమానికి నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి హాజరై స్వామికి ప్రత్యేక పూజ లు చేశారు. అయ్యప్ప దీవెనలతో నగర ప్రజలు సుఖసంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గండికోట కుమార్ స్వామి, గండి కోట రమేష్ స్వామి, వరికుప్పల శ్యామ్‌తో పాటు పెద్ద సంఖ్యలో స్వాములు పాల్గొన్నారు.

## ముద్రా లోన్ల పథకాన్ని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం : అందెల శ్రీరాములుయాదవ్

**సరూర్‌నగర్, డిసెంబర్ 5 ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్ర మోడి సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముద్రా లోన్ల పథకాన్ని తెలంగాణ రాష్ట్రంలో బ్యాంకుల ద్వారా అమలు చేయడంలో టిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెలశ్రీరాములు యాదవ్ ఆరోపించారు. నియోజకవర్గంలోని బాలాపూర్ చౌరస్తాలో నిరుద్యోగ యువత ఏర్పాటు చేసుకున్న బియాండ్ వేర్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అందెల మాట్లాడుతూ దేశంలోని నిరుద్యోగ యువతకు, చిరు వ్యాపారులకు ఉపాధి కోసం కేంద్రం ముద్ర లోన్లపథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. అయితే రాష్ట్రంలో ఈ పథకాన్ని అమలు చేయడం ప్రభుత్వం విఫలం అవుతున్నదని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ కార్పొరేషన్ కార్పొరేటర్లు ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, ముత్తంగి కరుణానిధిలతో పాటు రాజేష్‌రెడ్డి, పలువురు బిజెపి, బిజెవైఎం నాయకులు పాల్గొన్నారు.

## భగాయత్ కాలనీలో మౌళిక సదుపాయాలు : ఎమ్మెల్యే బేతి

**రామంతాపూర్, డిసెంబరు 5 ప్రభాతవార్త :** రామంతాపూర్ భగాయత్ కాలనీలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ బండారు శ్రీవాణి జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. భగాయత్ పరిధిలోని సాబేరాకాలనీ, శ్రీనగర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుతోపాటు, మంచినీటి సమస్య పరిష్కరించాలని సూచించారు. కాలనీ ఏర్పడి దశాబ్దాలు గడుస్తుందని, వెంటనే మౌళిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. త్వరలోనే పనులు చేపడుతామని అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి జిఎం జాన్‌షరీఫ్, మేనేజర్ రవీందర్, బిజెపి డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్రావ్, టిఆర్ఎస్ నేతలు గడ్డం రవికుమార్, గరిక సుధాకర్, డివిజన్ అధ్యక్షుడు ఎం.డి.ముస్తాక్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి : ఎమ్మెల్సీ నారాయణరెడ్డి

**మలక్‌పేట,డిసెంబరు 5 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. మలక్‌పేటలోని ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయనిధినుండి మంజూరైన చెక్కులను పలువురు లబ్దిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధిని పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## టిఆర్ఎస్‌లో మహిళలు, యువకులు చేరిక



సబితారెడ్డి సమక్షంలో టిఆర్ఎస్‌లో చేరిన మహిళలు

**సరూర్‌నగర్, డిసెంబర్ 5 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని 28వ డివిజన్‌కు సంబంధించిన వివిధ కాలనీల నుండి పెద్దఎత్తున యువకులు, మహిళలు టిఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్పొరేటర్ సూర్లగంటి అర్జున్ ఆధ్వర్యంలో వారు మంత్రి సబితాఇంద్రారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారికి టిఆర్ఎస్ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పలువురు టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి : రాధా

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 5 ప్రభాతవార్త :** విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆర్కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్‌కెపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌కాలనీ ఫేస్-3 కమ్యూనిటీ హాల్ రూ. 6.2లక్షల వ్యయంతో నిర్మిస్తున్న మొదటి అంతస్తూ భవనం పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలోని ప్రతి ఒక్కరికి ఉపయోగపడేలా అసోసియేషన్ భవనం నిర్మాణం చేపట్టి అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కుమార్, సతీష్, వెంకటేష్‌యాదవ్, శివ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## కనుల పండువగా మహా పడి పూజ



అయ్యప్ప పూజలో ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి తదితరులు

**హయత్‌నగర్, డిసెంబరు 5 ప్రభాతవార్తః** పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీపరిధి తట్టిఅన్నారం గ్రామంలో మాజీ సర్పంచి రావుల గోపాల్‌గౌడ్ గురుస్వామి సోమవారం అయ్యప్పస్వామి మహాపడిపూజ నిర్వహించారు. పూజా కార్యక్రమానికి టిఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా కమిటీ అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ చెవుల స్వప్న, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : ఆజం అలీ



కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆజం అలీ

**మలక్‌పేట, డిసెంబరు 5 ప్రభాతవార్త :** ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట నియోజకవర్గ టిఆర్ఎస్ ఇంఛార్జి ఆజంఅలీ పేర్కొన్నారు. ఆజంపురడివిజన్ ఆజం ఫంక్షన్ హాల్‌లో ఆజం అలీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వందలాది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో ఎంతోమంది పేదవారికి వైద్య పరీక్షలు నిర్వహించామని అవసరమైనవారికి మందులు అందజేసామన్నారు. అదే విధంగా అవసరమైన వారికి క్యాటరాక్ట్ సర్జరీని ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లాయఖ్ అలీ, ఎం.ఎ. బారి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతి సాంప్రదాయాలను చిన్నారులకు నేర్పించాలి : విఠల్‌రెడ్డి



గ్రాండ్ పేరెంట్స్ డేలో పాల్గొన్న విఠల్‌రెడ్డి తదితరులు

**వనస్థలిపురం, డిసెంబరు 5 ప్రభాతవార్త :** సంస్కృతి సాంప్రదాయాలను పిల్లలకు చిన్ననాటినుడే నేర్పించాలని నాగార్జున విద్యా సంస్థల ఛైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. హస్తినాపురం సెంట్రల్ కాలనీలో నాగార్జున మోడల్ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన గ్రాండ్ పేరెంట్స్ కార్యక్రమానికి అయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ చిన్నారులకు విద్యతోపాటు సంస్కృతి సాంప్రదాయాలను నేర్పించాలని, తల్లిదండ్రులు చిన్నారులకోసం కొంత సమయం కేటాయించాలన్నారు. అనంతరం గ్రాండ్‌పేరెంట్స్ పిల్లలకు ఆశీర్వచనాలు చేసారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ రజనీవిఠల్‌రెడ్డి, ప్రిన్సిపల్ పద్మావతి, ఇంచార్జిలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.